ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -107 మంగళవారం 4 ఆగస్టు 2026

# నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

**మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఊరట**

ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు

సహ నిందితుడు వినోద్ తోమర్‌కు కూడా క్లీన్ చిట్

గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చిందన్న బ్రిజ్ భూషణ్



**న్యూఢిల్లీ ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను, మరో నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నేడు తీర్పు వెలువరించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు తెరపడినట్లయింది.
తీర్పు వెలువడిన వెంటనే బ్రిజ్ భూషణ్ 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "నాపై ఆరోపణలు వచ్చిన రోజే చెప్పాను..

మిగతా 2లో.

# తాగునీటి ఎద్దడి పై దృష్టి పెట్టండి

**తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు**

**ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష**

**రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన**

**పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ**





**అమరావతి ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై

మిగతా 2లో.

# స్తంభించిన పార్లమెంట్

**నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయ విరాళాల చోరీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన**

**నిరసనల మధ్యే ఉభయ సభల్లో రెండు బిల్లులు**

**ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం**



**న్యూఢిల్లీ ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ స్తంభించింది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన అణచివేతకు హోం మంత్రి సరైన వివరణ ఇచ్చే వరకు పార్లమెంటులో తమ ఆందోళనను కొనసాగి స్తామని ప్రతిపక్షం పేర్కొంది. ఈ డిమాండ్ తో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు

మిగతా 2లో.



# బీజేపీకి ఎదురుగాలి

**మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు**

**గుజరాత్‌లో కమలంకు తగ్గిన మెజార్టీ**

**కాషాయ కంచుకోటలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం**

**బంకిపూర్ :ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
జెన్ జీ ఉద్యమంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని ఆ పార్టీ కోల్పోయింది.

మిగతా 2లో.

# చక్రవర్తి తన డిగ్రీ చూపిస్తారా?

**ప్రశ్నించిన అభిజిత్ దీప్కే -స్కాలర్‌షిప్‌తో, రుణంతో చదువుకున్నానని వెల్లడి**

**సీజేపీ సామాజిక ఉద్యమంగానే కొనసాగుతుందని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
నీట్ పేపర్ లీక్ వ్యవహారం లో దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే లక్ష్యం గా బీజేపీ సర్కార్ పావులు కదుపుతుంది. దీప్కే అమెరికా చదువుకునేందుకు డబ్బులు ఎలా వచ్చాయంటూ బీజేపీ నాయకులు ఆర్‌టీఐ దరఖాస్తును దాఖలు చేశారు. దీనిపై అభిజిత్ స్పందిస్తూ తన డిగ్రీని, విద్యా రుణాలకు సంబంధించి



మిగతా 2లో.

# రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

**రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్**

**ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది సీఎంలు వచ్చారని వ్యాఖ్య**

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలి**

**కర్నూలు ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత

మిగతా 2లో.



# ఉరవకొండలో వైసీపీ హంగామా

**ఆందోళన కార్యక్రమం రణరంగం**

**ధర్నాకు అనుమతి నిరాకరించినపోలీసులు**

**వాగ్వాదానికి దిగిన వైసీపీశ్రేణులు..**

**ఉద్రిక్తత మాజీ ఎమ్మెల్యేవిశ్వేశ్వర రెడ్డి,**

**మాజీ ఎంపీ మాధవ్ అరెస్టు.. విడుదల**



**ఉరవకొండ ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
ఉరవకొండ పట్టణంలో వైఎస్‌ఆర్సీపీ ఆందోళన రణరంగంగా మారింది. పోలీసులు, వైసీపీ కార్యకర్తల మధ్య గొడవ పెద్దవాతావరణాన్ని మరిపించింది. తెలుగుదేశం పార్టీపాలనలో ఉరవకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలకు

మిగతా 2లో.

# 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలి

**అది సూసైడ్ నోట్ కాదు కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జీషీట్**

**భవనాలే కాదు రాజకీయంగా సమాధి కట్టడమూ తెలుసు**

**89 కేసులున్న సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్**

**నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడొద్దు**

**ప్రభుత్వ ఒత్తిడి వల్లే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం**

**అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలి**

**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**

**హైదరాబాద్‌ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాక ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురానికి చెందిన గడ్డం వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం బాధాకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఆయన విడుదల చేసింది సూసైడ్ నోట్ కాదనీ, రాష్ట్ర ప్రభుత్వంపై చార్జీషీట్ వంటిదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 89 కేసులున్న రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా

మిగతా 2లో.



# కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

**చివరి నిమిషంలో మంకాల్ వైద్య పేరు తొలగింపు**

**సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు**

**పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక**

**ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది.

మిగతా 2లో.




# జోగినులకు అండగా ప్రభుత్వం

**లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్**

**అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి**

**జోగినులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి**

**హైదరాబాద్‌ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**
లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



మిగతా 2లో.

# స్తంభించిన పార్లమెంట్

ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేయడంతో సభా కార్యకలాపాలకు పలుమార్లు అంతరా యం ఏర్పడింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలకు, అయోధ్యలోని రామ మందిర దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపలా నిరసన తెలిపాయి. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు రావడం లేదు?' అంటూ రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతో పాటు ప్లకార్డులతో ఆందోళన చేపట్టాయి. వర్షాకాల సమావేశాలు మూడో వారంలోకి ప్రవేశించినప్పటికీ ఉభయ సభలలో ప్రతిపక్షాలు కొనసాగిస్తున్న ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించాయి. ఈ భారీ నిరసనల మధ్యే ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే చట్ట సవరణ లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. అదే విధంగా ప్రతిపక్షాల నిరసనల మధ్యే రాజ్యసభలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ సహకార (సవరణ) చట్టానికి మద్దతుగా తన నివేదికను సమర్పించింది. స్వల్ప మార్పులతో ఈ బిల్లును చట్టంగా మార్చాలని జేపీసీ సిఫారసు చేసింది. లోక్‌సభలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్ స్తంభించిన పార్లమెంట్ సవరణ బిల్లు, కేంద్ర సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది బ్యాంకు రికార్డులను కోర్టులో విశ్వసనీయ సాక్ష్యంగా స్వీకరించడానికి అనుమతిస్తుంది. 1891 నాటి చట్టం స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టంలో, డిజిటల్, ఎలక్ట్రానిక్, వర్చువల్ రికార్డులను బ్యాంకు రికార్డులుగా చేర్చడానికి నిబంధనలు ఉన్నాయి.ఇదిలా ఉండగా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ ఉభయ సభలలో ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల చర్య, అయోధ్యలో దారుణాలపై వివరంగా చర్చించకుండా నిరసనల నుంచి వెనక్కి తగ్గబోమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. నిరసనలు తీవ్రతరం కావడంతో ఉభయ సభలను నేటికి వాయిదా వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ నిరసనల కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు.

# బీజేపీకి ఎదురుగాలి

మొదటిపేజీ తరువాయి

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం లో కాంగ్రెస్ గెలుపొందగా, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. ఇక బీజేపీకి కంచుకోట అయిన బంకిపూర్ నియోజకవర్గంలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై ప్రశాంత్ కిషోర్ 18,953 ఓట్ల తేడాతో గెలుపొందారు. తొలి రౌండ్ నుంచే బీజేపీపై ఆధిక్యత కనబరుస్తూ వచ్చిన కిషోర్‌కు మొత్తంగా 63,203 ఓట్లు రాగా, సిన్హాకు 44,250 ఓట్లు లభించాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,085 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ వార్త తెలియగానే జన్ సురాజ్ పార్టీ ప్రధాన కార్యాలయంలో, ఓట్ల లెక్కింపు కేంద్రం వెలుపల సంబురాలు మిన్నంటాయి. పార్టీ అభిమానులు, మద్దతుదారులు డ్యాన్స్‌లు చేస్తూ, మిఠాయిలు పంచుతూ కనిపించారు. మాజీ ఎన్నికల వ్యూహకర్త అయిన కిషోర్ కొన్నేండ్ల క్రితమే పార్టీని స్థాపించారు. మొదటిసారిగా ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 1995 నుంచి ఈ సీటులో బీజేపీ ఎన్నడూ ఓడిపోలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకిపూర్ సీటుకు ఉప ఎన్నికలు జరిగాయి. జులై 30న ఉప ఎన్నికల్లో 34.30శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 26 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఈ అసెంబ్లీ సీటు నుంచి నబిన్ వరుసగా ఐదు సార్లు విజయం సాధించారు. అంతకుముందు ఆయన తండ్రి ప్రాతినిధ్యం వహించారు.

**బీజేపీ నాయకత్వాన్ని బీహార్ ప్రజలు తిరస్కరించారు : ప్రశాంత్ కిషోర్**

బీహార్ ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని తిరస్కరించారని ప్రశాంత్ కిషోర్ అన్నారు. గెలుపు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు మాత్రమే జరిగినది కాదన్నారు. బీహార్ నాయకత్వంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని, బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని తెలిపారు. నేరపూరిత ధోరణులు, వివాదాస్పద ప్రవర్తన ఉన్న వ్యక్తికి బీజేపీ నాయకత్వాన్ని అప్పగించిందని, ఇలాంటి నాయకత్వాన్ని బీహార్ ప్రజలు అంగీకరించరని చెప్పారు. ప్రజలిచ్చిన తీర్పును బీజేపీ గౌరవంగా స్వీకరిస్తుందని ఆ పార్టీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ సరగోయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజా తీర్పు అన్నింటికంటే అతీతమైనదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల్లా రాజ్యాంగ వ్యవస్థలను లేదా ఈవీఎంలను, ఎన్నికల కమిషన్‌ను తాము విమర్శించబోమని అన్నారు.

**మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, గుజరాత్‌లో బీజేపీ అభ్యర్థుల గెలుపు**

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారిపై 6,016 ఓట్ల తేడాతో ఘన్‌శ్యామ్ గెలుపొందారు. ఆయనకు 66,757 ఓట్లు పోలయ్యాయి. ఆజాద్ సమాజ్‌పార్టీకి చెందిన దామోదర్ యాదవ్‌కు సుమారు 22 వేల ఓట్లు పోలయ్యాయి. గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. వడోదర జిల్లాలో ఉన్న ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ గెలుపొందారు. మాజీ మంత్రి యోగేశ్ పటేల్ జూన్ 2న మృతిచెందడంతో ఆ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. మంజల్‌పూర్ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ మాత్రమే పోటీలో నిలిచాయి. గతం కంటే బీజేపీకి ఈ ఉపఎన్నికల్లో ఓట్లు తగ్గటం గమనార్హం.

# తాగునీటి ఎద్దడి పై దృష్టి పెట్టండి

మొదటిపేజీ తరువాయి

ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు.రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు.

ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు.

సీమ పురోగతి కోసం ఆయన 'ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యాటకం, పర్యావరణం' విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

## చక్రవర్తి తన డిగ్రీ చూపిస్తారా?

పత్రాలను బహిరంగంగా చూపించడానికి తాను సిద్ధమని, మరి బీజేపీ నేతలు కూడా తమ విద్యార్హతలను వెల్లడిస్తారా? అంటూ ఆయన సోమవారం ప్రశ్నించారు. "నాకు వచ్చిన స్కాలర్‌షిప్ లేఖను, విద్యా రుణం తీసుకున్న లేఖను చూపించడానికి నేను సిద్ధమే, మరీ మీ చక్రవర్తి కూడా తన డిగ్రీ చూపిస్తారా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. బోస్టన్‌లో పబ్లిక్ రిలేషన్స్‌లో కోర్సు పూర్తి చేసిన దీప్కే కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి నేతృత్వం వహించేందుకు జూన్‌లో భారత్‌కు తిరిగి వచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 6వ తేదీన జంతర్ మంతర్ వద్ద ఆయన ఆందోళన ప్రారంభించారు. తొలుత నిరాహార దీక్షగా ప్రారంభమైన ఈ ఉద్యమం దాదాపు రెండు మాసాల వ్యవధిలోనే జాతీయస్థాయిలో ఉద్యమంగా రూపుదిద్దుకున్న సంగతి తెలిసిందే.ప్రభుత్వం తనపై ఏ దర్యాప్తు నిర్వహించాలనుకున్నా అందుకు తాను సిద్ధమేనంటూ దీప్కే ప్రభుత్వాన్ని సవాలు చేశారు. "ఏ వ్యక్తి అయినా ఈ ప్రభుత్వాన్ని సవాలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని వేధించేందుకు ఈడీ, సీబీఐ, ఇతర సంస్థలను పంపిస్తుంది. ఒకవేళ ప్రధాని నా వద్దకు ఈడీని పంపించాలనుకుంటే, ప్రధాని తన డిగ్రీ సర్టిఫికెట్ కాపీని కూడా పంపించాలి. అప్పుడు నేను కూడా నా విద్యా రుణం, స్కాలర్‌షిప్ వివరాలు, డిగ్రీ సర్టిఫికెట్‌ను బహిరంగపరుస్తాను." అని ఆయన ఛత్రపతి శంభాజినగర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే ఉద్దేశం ఉందా అంటూ విలేకర్లు అడిగిన ప్రశ్నపై దీప్కే స్పందిస్తూ, రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు మా కంటే కూడా మీడియా చాలా ఆత్రంగా వుందని వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం ఈ దేశంలో వున్న రాజకీయ పార్టీల సంఖ్యను చూసినట్లైతే, మీరు కూడా నిరాశపడి వుంటారని అనిపిస్తోంది. అయినా దీన్ని ఒక సామాజిక ఉద్యమంలా కొనసాగించాలన్నదే మా అభిమతం. దేశంలో ప్రస్తుతమున్న రాజకీయ స్థితిగతులను చూస్తున్నాం కదా, మరో పార్టీని ఏర్పాటు చేసి ఏం లాభం." అని ఆయన వివరించారు. జార్ఖండ్‌లోని విద్యార్థుల ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు వుంటుందని దీప్కే ప్రకటించారు. వారితో తాను మాట్లాడానని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఆ డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు వెనక్కి తగ్గవద్దని వారిని కోరానని చెప్పారు.

## కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు.

సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు.

## జోగినులకు అండగా ప్రభుత్వం

తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు.జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## నిర్దోషిగా బ్రిజ్‌భూషణ్

అవి రుజువైతే ఉరి వేసుకుంటానని. ఈ రోజు కోర్టు నన్ను గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చింది. జరిగిందేదో జరిగిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు.డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 2023 జూన్ 15న సుమారు 1500 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతిగా ఉన్న సమయంలో స్వదేశీ, విదేశీ మహిళా రెజ్లర్ల పట్ల బ్రిజ్ భూషణ్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఆయనను, సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది.

# ఉరవకొండలో వైసీపీ హంగామా

మొదటిపేజీ తరువాయి

నిరసనగా మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి ఉరవకొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. సోమవారం ఉరవకొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డిని అరెస్టు చేశారు. పోలీసులు వైఎస్ఆర్సీపీ కార్యకర్తలకు తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చారు. ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా అందర్నీ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పెనుగులాట చోటుచేసుకుంది. మహిళలను సైతం అడ్డుకున్నారు. ధర్నా కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఒక్కసారిగా ఈ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారంటూ పోలీస్ వాహనాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. పోలీసులకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం తోపులాట జరిగింది. అక్రమ అరెస్టులకు నిరసనగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. వై. విశ్వేశ్వర రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. పార్టీ కార్యకర్తల్లో ఉన్న మాధవు వాహనంలో ఎక్కించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు సంవత్సరాల టీడీపీ పాలనలో ఉరవకొండ నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు పెద్దపీట వేస్తారని విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. పోలీసులు తమను మంత్రి మెప్పుకోసం అరెస్టు చేయడమే కాకుండా లాఠీచార్జ్ చేసినట్లు విమర్శించారు. మహిళలను చూడకుండా వారిపై దాడికి పాల్పడడం ఎక్కడ ధర్మమని ప్రశ్నించారు. జిల్లాలో ఉరవకొండ నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలు మరి ఎక్కడా లేవన్నారు. అన్నింటిలోనూ మంత్రి ప్రమేయం ఉందని విమర్శించారు. దీనిపై శాంతియుతంగా ఆందోళన చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా అనుమతి లేకుండా ఆందోళన చేయడంతో పోలీసులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ మాధవ్ తోపాటు అదుపులోకి తీసుకున్న వైసీపీ శ్రేణులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

చేయడమే కాంగ్రెస్ పార్టీ చేసిన "క్రిమినల్ వేస్ట్"అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు, నిరుద్యోగులను మోసం చేసినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16,978 ఉద్యోగాలనే మాత్రమే భర్తీ చేసిందన్నారు. అందులోనూ బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లను తీసేస్తే 10 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని వివరించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో సమాధానం చెప్పాలని రాహుల్‌గాంధీని, రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి సాధించిన విజయం అంటే 150 మంది గురుకుల విద్యార్థుల మరణాలా? లేక ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులకు "ఎండ్రిన్ తాగి చావండి" అనే పరిస్థితి కల్పించడమా?అని ప్రశ్నించారు. 21 ఏండ్లకే చట్టసభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలంటూ మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతలను యువకుడికి అప్పగించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చేతిలో లేని అంశాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. 21 ఏండ్ల అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసినా అది ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండబోదని స్పష్టం చేశారు.

**జాబులు లేని క్యాలెండర్**

ఎన్నికల సమయంలో నిరుద్యోగులను కేవలం ఓట్ల కోసం ఉపయోగించుకోవడం కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా అలవాటేనని కేటీఆర్ విమర్శించారు. యూత్ డిక్లరేషన్ సహా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా యువతను మోసం చేసిందని చెప్పారు. ఉద్యోగాల పేరుతో అసెంబ్లీలో పెట్టింది జాబ్ క్యాలెండర్ కాదనీ,"జాబులు లేని క్యాలెండర్" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువత ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశ చెందొద్దనీ, ఒత్తిడికి గురికావొద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎవరూ ఆత్మహత్యలు లేదా బలవన్మరణాలకు పాల్పడొద్దని కోరారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతోపాటు వారి భవిష్యత్తుకు అండగా నిలిచే విధానాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, చదువుకున్న యువతను "క్రిమినల్ వేస్ట్" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించడంపై రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

**ఎన్నికల అఫిడవిట్ నింపే తెలివి ఉందా?**

విద్యార్థులను, యువతను అవమానించే అర్హత రేవంత్ రెడ్డికి లేదని కేటీఆర్ అన్నారు. ఆయన జీవితంలో ఎప్పుడైనా పోటీ పరీక్ష రాశారా? కనీసం ఉద్యోగానికి దరఖాస్తు ఫారం నింపారా? అని ప్రశ్నించారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌ను సైతం స్వయంగా నింపే తెలివి రేవంత్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. లక్షలాది మంది విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్" అనడం అత్యంత అవమానకరమని అన్నారు. రాష్ట్రంలో నిర్మితమైన ప్రాజెక్టులు, రోడ్లు, భవనాలు, సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, రూ.200 కోట్ల జూబ్లీహిల్స్‌లోని బోధి ప్యాలెస్ వంటి నిర్మాణాలన్నీ ఇంజినీర్ల ప్రతిభ ఫలితమేనని గుర్తు చేశారు. అలాంటి ఇంజినీర్లనే అవమానించిన రేవంత్ రెడ్డి వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి భవనాలు నిర్మించడం మాత్రమే కాదనీ, అవమానించిన నాయకులకు, ఆ పార్టీలకు రాజకీయంగా సమాధి కట్టడం కూడా తెలుసని అన్నారు.

**అసెంబ్లీలో ఉద్యోగాల గురించి అడుగుతాం**

అసెంబ్లీ సమావేశాలను 15 రోజులపాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని కోరారు. ప్రభుత్వం ఇందుకు సిద్ధం కాకపోతే యువతకు చేసిన ద్రోహాన్ని అసెంబ్లీలో బీఆర్ఎస్ తరపున గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఐటీ రంగం క్షీణించడానికి కూడా ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు. తెలంగాణ ఐటీ ప్రగతి తిరోగమనంలోకి వెళ్లిందన్నారు.

**అవి కాళేశ్వరంలో భాగం కాదా?**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అబద్ధాలు ప్రచారం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నిండిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, అక్కడి నుంచి మిడ్ మానేరు వరకు నీరు ఎలా వస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. గాయత్రి పంప్ హౌస్, మేడారం పంపింగ్ వ్యవస్థను ఎవరు నిర్మించారో, అవి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదా అని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రివర్స్ పంపింగ్, మానేరు నుంచి ఎస్ఆర్ఎస్పీకి నీటిని తరలించే కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు.

**భూముల కోసమే మెట్రో స్వాధీనం**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ప్రయివేట్ కంపెనీ అప్పులను రాష్ట్ర ప్రజలపై మోపే ప్రయత్నం జరుగుతోందన్నారు. మెట్రో భూములను కొల్లగొట్టేందుకే ఈ ప్రయత్నం చేస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మెట్రో విస్తరణకు అభ్యంతరం చెప్పని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తోందో, మెట్రోను స్వాధీనం చేసుకోవాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఏంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని అన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రైతుల అభివృద్ధి

## తెలుగుదేశం పార్టీనాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున



**దేవనకొండ ఆగస్టు 3 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** సోమవారం నాడు దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామం నందు ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ గార్ల ఆదేశాల మేరకు అక్షిత చారిటబుల్ ట్రస్ట్ వారు అందిస్తున్నటువంటి 50% రాయితీ పై స్ప్రే పంపులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేస్తూ సబ్సిడీపై అనేక రకాలైన ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్, హార్టికల్చర్ రైతులకు ప్యాక్ హౌస్ లు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, గోకులం షెడ్లు, డ్రిప్ ఇరిగేషన్ లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతుందని రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు స్ప్రే పంపు లు 50% రాయితీపై అందిస్తున్నటువంటి అక్షిత చారిటబుల్ ట్రస్ట్ అంజి స్వామికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్న రాముడు, చిన్న వెంకప్ప, రాఘవేంద్ర, పరమాల నాగేష్, బాట మీద రాజు, కోలంట్ల తిమ్మప్ప, నాగరాజు, భీమన్న రైతులు రామనాయుడు, పెద్దయ్య, సతీష్, సుంకన్న, నాగప్ప తదితరులు పాల్గొన్నారుద

# కుంకనూరు గ్రామంలో దళితపేట సమస్యల పరిష్కరించండి...




**దేవనకొండ ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** మండలంలోని కుంకునూరు గ్రామంలో ఎస్సీ కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కే శ్రీనివాసులు డిమాండ్ చేశారు... సోమవారం నాడు మండలంలోని కుంక నూరు గ్రామ సచివాలయం ముందు ఎస్సీ కాలనీ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం మరియు భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.వీరేంద్రనాయుడు అధ్యక్షతన సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర శేఖర్ ,శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సి.సి రోడ్లు, డ్రైనేజీ ,తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు అదేవిధంగా పార్కు చాలా అస్తవ్యస్తంగా ఉందని వెంటనే పార్కు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శుభ్రపరచాలని కోరారు దళితుల స్మశాన వాటిక వెళ్లే ప్రధానమైన రహదారి సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై మట్టి వేయాలని కోరారు అదేవిధంగా అర్హులైన వారికి ఇల్లు ,ఇళ్ల స్థలాలు ,భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈరప్ప సూర్యచంద్ర గ్రామస్తులు కార్తీక్, రంజిత్, నారాయణ, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు

# పాణ్యం ఎమ్మెల్యే సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ అర్హులైన 10 గ్రామాలకు చెక్కులు పంపిణి

## ఓర్వకల్లు టిడిపి మండల కన్వీనర్ నాగిరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి




**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు0 3 (రిపబ్లిక్ న్యూస్)** నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు మరియు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సహకారంతో సోమవారం రోజు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఓర్వకల్లు మండలంనకు చెందిన సుమారు 10 గ్రామలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్స్ అందజేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు ,ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం టిడిపి సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, ఓర్వకల్లు టిడిపి మండల అధ్యక్షులు దుగ్గపూటి నాగిరెడ్డి,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్ రెడ్డి, తెలుగు దేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నన్నూరు శకునాల గ్రామంలోతల్లిపాల వారోత్సవాలు




**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు 03(రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంనన్నూరు గ్రామంలోని అంగన్వాడి సెంటర్స్ రెండు మూడు నందు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నాము ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం 03-08-2926 అంగన్వాడి సెంటర్స్ రెండు మూడు నందు గర్భవతులు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ జరీనా మేడం , ఏఎన్ఎం శ్రీలత మేడం, ఆశా వర్కర్స్ అంగన్వాడీ టీచర్స్, జే సరళ ఎస్ సుశీలమ్మ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగినది, ఓర్వకల్లు మండలంశకునాల గ్రామం నందు సోమవారం రోజు అంగన్వాడి సెంటర్ నంబర్ టు నందు తల్లిపాల వారోత్సవాలు మీటింగు జరిగింది తల్లులకు ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం పిల్లలకు తల్లిపాలతో పాటు పోషకాహారమైన విలువలు పాటించాలని ర్యాలీ చేయడం జరిగింది, ఏ ఎన్ ఎం కే యశోద మేడం కె వినిషా మేడం అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి సెంటర్ నందు తల్లిపాల వారోత్సవాలు జరపడం జరిగింది

# అధునాతన సౌకర్యాలతో నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణం వేగవంతం

## పౌరులకు ఒకేచోట అన్ని సేవలు : పనులను పరిశీలించిన కమిషనర్ చల్లా ఓబులేసు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)** నగర ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు వేగవంతమైన పౌర సేవలను అందించాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ అధునాతన సౌకర్యాలతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఎన్ఆర్‌పేటలో నిర్మాణంలో ఉన్న నూతన కార్యాలయ భవనాన్ని ఆయన పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన అన్ని పౌర సేవలు ఒకేచోట అందుబాటులో ఉండేలా జి+2 నమూనాలో ఆధునిక కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవనంలో విశాలమైన కార్యాలయ గదులు, ఆధునిక సౌకర్యాలు, తగిన పార్కింగ్ వసతి, మహిళల కోసం ఫీడింగ్ రూమ్, దివ్యాంగులకు ర్యాంపులు, భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన ఏర్పాట్లు కల్పిస్తున్నామని చెప్పారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించిన కమిషనర్, ఈ భవనం అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందడమే కాకుండా, పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా మారుతుందని పేర్కొన్నారు.అనంతరం కమిషనర్ వద్దేగిరి, బాపూజీనగర్, ఎన్ఆర్‌పేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి అక్కడి నిర్వహణ తీరును సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, డిఈఈ శ్రీనివాసన్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ జగదీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 104 ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)** జిల్లాలోని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు అందాయి. వాటిలో కుటుంబ వివాదాలు, భూవివాదాలు, ఆస్తి ఆక్రమణలు, వేధింపులు, దాడులు, ఆర్థిక మోసాలు, ప్రజా రహదారుల ఆక్రమణల వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

ప్రధాన ఫిర్యాదులు:తన కుమారుడు ఇంటిని ఆక్రమించి అద్దెలు వసూలు చేసుకుంటూ పోషణ చూడడం లేదని కర్నూలు వన్‌టౌన్‌కు చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు.

తమ మూడు ఎకరాల వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోడుమూరు మండలం బైన్‌దొడ్డి గ్రామానికి చెందిన నాగరాజు వినతి సమర్పించారు.

భర్త మరణం అనంతరం కుమారుడు, కోడళ్లు ఇంటిని తమ పేరుపై రాయాలని ఒత్తిడి చేస్తూ వేధిస్తున్నారని కర్నూలు శరీఫ్‌నగర్‌కు చెందిన వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు.బంగారుపేట ప్రాంతంలో రహదారి ఆక్రమణల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం కోటకొండ గ్రామానికి చెందిన సుమలత కోరారు.

రూ.16 లక్షల విలువైన మిరప పంటను తీసుకెళ్లి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కృష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన మండ్ల శ్రీకేశులు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, రామయ్య నాయుడు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లు మండలాన్ని కరువు మండలంగా తక్షణమే ప్రకటించాలి

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏపీ రైతు సంఘం డిమాండ్ -సిపిఐ మండల కార్యదర్శి ఆవుల రమేష్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్





**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు03 (రిపబ్లిక్ న్యూస్)** సోమవారం రోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆఫీస్ దగ్గర ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ మండల కార్యదర్శి ఆవుల రమేష్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ లు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన అరకొరా వర్షాలకు ఓర్వకల్లు మండలంలో రైతులు వేల ఎకరాల భూముల్లో పత్తి,కంది, వేరుశనగ ,ఉల్లి ఆముదము పంటలు విస్తారంగా వేయడం జరిగింది. విత్తనం వేసిన తర్వాత గత రెండు నెలలు కాలం నుండి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో వర్షాలు లేకపోవడం వల్ల వేసిన పంటలు మొలక దశలోనే వాడిపోయి ఎండిపోతున్నాయి. ఇప్పుడు వర్షాలు పడినకూడా పంట పండే పరిస్థితి లేదు.. రైతులు పంటలు వేయడానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులు దగ్గర బ్యాంకులోను రుణాలు తీసుకొని విత్తనాలు ఎరువులు సాగు ఖర్చులకోసం విపరీతంగా పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. సిల్లిగవ్వ వచ్చే పరిస్థితి లేదు. తక్షణమే రైతులను ఆదుకోవాలి..

డిమాండ్స్. ఓర్వకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు పంట నష్ట పరిహారం చెల్లించాలి. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రెండు లక్షల రూపాయల వరకు రద్దు చేయాలి. తదితర డిమాండ్లతో సోమవారం రోజు తహసిల్దార్ ఆఫీస్ దగ్గర ధర్నా చేసి అనంతరం తహసిల్దార్ విద్యాసాగర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహబూబ్ బాషా ఉప్పలపాడు సిపిఐ నాయకులు ఆవుల రాజు జయన్న తదితరులు పాల్గొనడం జరిగింది

# తల్లిపాలలోనే పిల్లల ఆరోగ్య భవిష్యత్తు

## పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలి- డాక్టర్ సింధియా శుభప్రద






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)** పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు తల్లిపాలలోనే ఉందని, ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టినప్పటి నుంచి కనీసం ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పర్ల గ్రామంలోని రూరల్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్, నోడల్ అధికారి డాక్టర్ పుష్పలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధియా శుభప్రద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.తల్లిపాలలో శిశువుల ఎదుగుదలకు అవసరమైన అత్యధిక పోషక విలువలు, రోగనిరోధక శక్తిని పెంచే మూలకాలు సమృద్ధిగా ఉంటాయని ఆమె తెలిపారు. శిశువుల ఆరోగ్య పరిరక్షణకు తల్లిపాలు అత్యంత ముఖ్యమని, జననం తర్వాత తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన ఇంటర్న్ వైద్య విద్యార్థులు పోస్టర్ల ద్వారా తల్లులకు తల్లిపాల ప్రాధాన్యత, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రేణుక, నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవి నాయక్, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ ప్రసన్న రాణి, పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ పూజ, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ తస్లీమ్, డాక్టర్ నిరంజన్, లెక్చరర్ సురేష్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, హెల్త్ సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు, పార్వతమ్మ, ఏఎన్ఎంలు సుభాషిని, భవాని, అంగన్వాడీ టీచర్ అనసూయ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# పెద్ద చెరువు అభివృద్ధితో నంద్యాల ప్రజలకు మెరుగైన వాకింగ్, వినోద సౌకర్యాలు

**చెరువుల పరిరక్షణతో పాటు పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం -రూ.3.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సోలార్ లైటింగ్ పనులకు శంకుస్థాపన**

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**





**నంద్యాల బ్యూరో, ఆగస్టు 03 (రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ పెద్ద చెరువు కట్ట వద్ద అమృత్ ట్యాంక్ పథకం కింద రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 2.5 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సోలార్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, పెద్ద చెరువు అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం నంద్యాల ప్రజలకు మెరుగైన వాకింగ్, ఆరోగ్య పరిరక్షణ, వినోద సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నంద్యాల పట్టణ అభివృద్ధిలో భాగంగా టౌన్ హాల్ పరిసరాల్లో పార్కుల ఏర్పాటు, పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, డిగ్రీ కళాశాలలు, నేషనల్ కళాశాల వంటి విద్యా, పరిపాలనా మౌలిక వసతులు అభివృద్ధి చెందడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు నంద్యాల ప్రాంత ప్రజలు తాగునీటి కోసం కుందూ నది, దూర ప్రాంతాల బావులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అనంతరం కే.సి. కెనాల్ ద్వారా సాగు, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడిందన్నారు. 1999లో నూనెపల్లె, మూలసాగరం తదితర గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ప్రభుత్వ నిధులు అందుబాటులోకి వచ్చాయని, భూగర్భ జలాల వినియోగం, బోరుబావులు, ఇతర మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల పట్టణానికి జీవనాధారాలైన చిన్న చెరువు, పెద్ద చెరువులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, భూగర్భ జలాలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టడంతో పాటు భవిష్యత్ తరాలకు ఈ నీటి వనరులను భద్రంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వాకర్ల కోసం ఆధునిక వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సోలార్ లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను జిల్లా కేంద్ర నియంత్రణ వ్యవస్థకు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన తాగునీటి సదుపాయం, ఎన్‌జీఓస్ కాలనీకి అనుసంధానంగా వంతెన నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి ప్రతిపాదనలను కూడా పరిశీలించి, బడ్జెట్‌కు అనుగుణంగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సహకారంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని, వేప, ఉసిరి, మారేడు, రావి వంటి ఔషధ, నీడనిచ్చే మొక్కలను అటవీ శాఖ ద్వారా ఉచితంగా అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా వాటి నిర్వహణలో కూడా ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. చెరువులు, రోడ్లు, డ్రెయిన్లు వంటి ప్రజా ఆస్తులను ప్రతి ఒక్కరూ తమ సొంత ఆస్తుల్లా భావించి సంరక్షించాలని, నీటి వనరుల్లో చెత్త వేయకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. నంద్యాల పట్టణంలో వెడల్పాటి రహదారులు, డివైడర్లలో మొక్కల పెంపకం, చివరి కాలనీల వరకు రోడ్లు, డ్రెయినేజీ అనుసంధానం, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బల్క్ వేస్ట్ జనరేటర్ల వద్ద బయో డైజెస్టర్ల ఏర్పాటు ద్వారా కంపోస్ట్ తయారీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "స్వచ్ఛ నంద్యాల" సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఖరీఫ్ పంటల నమోదే రైతులకు రక్షణ కవచం

**ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి":-వ్యవసాయ అధికారి ఉషారాణి**







**దేవనకొండ , ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను కచ్చితంగా నమోదు చేయించడం అత్యంత కీలకమని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో అన్ని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కే) సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రైతులు తమ పొలాల్లో ఏ పంటను సాగు చేశారో అదే పంటను నమోదు చేయించాలని, పంట నమోదులో రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే పలు పథకాల ప్రయోజనాలు పొందాలంటే పంట నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు.
కేవీకే శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే సజ్జలు, జొన్నలు, మినుములు, రాగులు, కొర్రలు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటలు కూడా మెరుగైన ఫలితాలు ఇస్తాయని వివరించారు.
మండల వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉండటంతో పంటలపై ఒత్తిడి ఏర్పడే అవకాశముందని తెలిపారు. దీనిని అధిగమించేందుకు యూరియా 2 గ్రాములు లేదా 19:19:19 ఎరువును 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటను కొంత మేర రక్షించుకోవచ్చని రైతులకు సూచించారు.
ఆర్ఎస్కే సిబ్బంది ప్రతి పొలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి రైతులు సాగు చేసిన పంటలను ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు కూడా పంట నమోదులో చురుకుగా పాల్గొని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయకుమార్, మండల వ్యవసాయ అధికారి ఉషారాణి, హెచ్.ఓ. లక్ష్మీ ప్రసన్న, వెటర్నరీ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈవోలు రంగన్న, మల్లికార్జున, అబ్దుల్ సలాం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రంగస్వామి, మురళి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలే లక్ష్యం

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి -రీ-ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులు తగ్గించాలి**

**పునరావృత వినతులపై వారంలోగా ప్రత్యేక చర్యలు - శాఖల వారీగా కార్యాచరణ నివేదికలు సమర్పించాలని ఆదేశం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)**
ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి అర్జీదారుడు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన, పారదర్శకమైన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో సాధారణ ప్రజా సమస్యలతో పాటు ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు.
ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని చర్యలు చేపట్టాలని, పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో కారణాలను పూర్తిగా వివరించి, తీసుకోబోయే చర్యలపై కూడా పిటిషనర్లకు సమాచారం అందించాలని సూచించారు.
పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న రీ-ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్జీ పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఒకే వ్యక్తి పలుమార్లు సమర్పించిన




వినతులను ప్రత్యేకంగా గుర్తించి, ఆయా పిటిషనర్లతో నేరుగా మాట్లాడి వారంలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ వినతులు సమర్పించిన పిటిషనర్ల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని తెలిపారు.
రెవెన్యూ, సర్వే, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఏపీఈపీడీసీఎల్, విద్య, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, ఎండోమెంట్స్, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి పునరావృతంగా వచ్చిన వినతుల జాబితాను సిద్ధం చేసి అందజేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులు ప్రతి పిటిషనర్‌ను వ్యక్తిగతంగా సంప్రదించి సమస్యల స్థితిగతులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
రానున్న శుక్రవారం సాయంత్రం నాటికి తమ శాఖ పరిధిలో ఎంతమంది పిటిషనర్లతో మాట్లాడారు, ఎన్ని వినతులు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, పరిష్కరించలేని అంశాలకు గల కారణాలేమిటి అనే పూర్తి వివరాలతో కార్యాచరణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. గత నెలతో పోలిస్తే ప్రస్తుత నెలలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ శాతం తగ్గిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అందుకు గల కారణాలను విశ్లేషించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టి జిల్లాకు మెరుగైన స్థానం తీసుకురావాలని ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కుంకనూరు గ్రామంలో దళితపేట సమస్యల పరిష్కరించండి..



**దేవనకొండ ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
మండలంలోని కుంకునూరు గ్రామంలో ఎస్సీ కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కే శ్రీనివాసులు డిమాండ్ చేశారు...



సోమవారం నాడు మండలంలోని కుంక నూరు గ్రామ సచివాలయం ముందు ఎస్సీ కాలనీ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం మరియు భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.వీరేంద్రనాయుడు అధ్యక్షతన సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర శేఖర్ ,శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సి.సి రోడ్లు, డ్రైనేజీ ,తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు అదేవిధంగా పార్కు చాలా అస్తవ్యస్తంగా ఉందని వెంటనే పార్కు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శుభ్రపరచాలని కోరారు దళితుల స్మశాన వాటిక వెళ్లే ప్రధానమైన రహదారి సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై మట్టి వేయాలని కోరారు అదేవిధంగా అర్హులైన వారికి ఇల్లు ,ఇళ్ల స్థలాలు ,భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈరప్ప సూర్యచంద్ర గ్రామస్తులు కార్తీక్, రంజిత్, నారాయణ, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు

## ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ లోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కలిపించాలి

**కర్నూలుజిల్లా కలెక్టర్ కి వినతి పత్రం- ప్రతి నెల 4వ శనివారం స్థానిక యువతకు ఉద్యోగ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ ఏ సిరి హామీ**



**ఓర్వకలు ప్రతినిధి, ఆగస్టు 03 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలం లో ఏర్పాటు అవుతున్న పరిశ్రమల్లో స్థానిక యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ఫోరమ్ అధ్యక్షులు శ్రీరాములు గుట్టపాడు మాజీ సర్పంచ్ నా.మోహన్ రెడ్డి, నవ్యంధ్ర విద్యార్థి జేఏసీ అధ్యక్షులు అయ్యా స్వామి లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. శిరి కి వినతిపత్రం సమర్పించారు వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ గత వారం లో అన్నీ పరిశ్రమ యాజమాన్యం వారితో సమావేశం నిర్వహించాము అని ప్రతి నెల స్థానిక యువతకు ఉద్యోగ మేళా నిర్వహించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు

## ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**నీటి నాణ్యతపై నిరంతర పరీక్షలు, నీటి నిల్వలుభూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)**జిల్లాలోని ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన త్రాగునీరు అందించే దిశగా అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్‌ను ఆదేశించారు.కేంద్ర జల జీవన్ మిషన్ అడిషనల్ సెక్రటరీ కమల్ కిషోర్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని నీటి వనరుల నుంచి వర్షాలు పడకముందు, వర్షాలు పడిన తర్వాత నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నీటిలో ఉండే రసాయనాలు, కాలుష్య కారకాలను గుర్తించి, అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టి ప్రజల వినియోగానికి అనుకూలంగా మార్చాలని ఆదేశించారు.పారిశ్రామిక ప్రాంతాలు, డంపింగ్ యార్డులు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, బోరు బావులు తదితర ప్రాంతాల నీటిని క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే ప్రస్తుతం వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధి హామీ పథకం పనుల ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు.నీటి నిల్వలు పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా గణనీయంగా పెరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు.

## రీ సర్వే పనుల వేగవంతానికి 28 ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**ప్రభుత్వం అందించిన సాంకేతిక వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)**
జిల్లాలో రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అందించిన ల్యాప్‌టాప్‌లను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విలేజ్ సర్వేయర్లకు సూచించారు.
కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్వే శాఖ ద్వారా సరఫరా చేసిన 28 హెచ్‌పీ కంపెనీ ల్యాప్‌టాప్‌లను జిల్లా కలెక్టర్ విలేజ్ సర్వేయర్లకు పంపిణీ చేశారు. ఒక్కో ల్యాప్‌టాప్ విలువ సుమారు రూ.1.53 లక్షలు కాగా, వీటిని రీ సర్వే కార్యక్రమాల నిర్వహణ కోసం వినియోగించనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సాంకేతిక పరికరాలను జాగ్రత్తగా ఉపయోగించడంతో పాటు రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహించే ముందు సంబంధిత భూస్వాములకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలోనే పారదర్శకంగా సర్వే చేపట్టాలని సూచించారు.రీ సర్వే ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా భూ రికార్డుల ఖచ్చితత్వం పెరుగుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# 15వ వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం



**గుంతకల్లు, ఆగస్టు 3: (రిపబ్లిక్ న్యూస్)** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు టీడీపీ నాయకులు సోమవారం గుంతకల్లు పట్టణంలోని 15వ వార్డు బూత్ నంబర్ 80లో డోర్‌టుడోర్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మండల టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి మార్గదర్శకత్వంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ గుడ్‌ఫిట్టింగ్ ఆంజనేయులు, వార్డు అధ్యక్షుడు దబ్బర నారాయణ, 84వ బూత్ కో-కన్వీనర్ నవీన్, వాల్మీకి కదిరప్ప, గోవిందరాజులు తదితర టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు ఆళ్లగడ్డ క్రీడాకారులు ఎంపిక.

### డి. కార్తీక్ నాయక్, ఎమ్. వివేకానంద ఎంపిక.




**ఆళ్లగడ్డ ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్** ఆగస్టు 1వ తేదీన కర్నూలు బి క్యాంప్ క్రీడా మైదానంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల అథ్లెటిక్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 20 జావలిన్ త్రోలో వివేకానంద బంగారు పతకం, అండర్ 16 జావలిన్ త్రోలో కార్తీక్ నాయక్ సిల్వర్ మెడల్ సాధించి ఆగస్టు 10,11,12 వ తేదీలలో చిత్తూరు జిల్లా తిరుపతిలో జరిగేటు వంటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు అని గవర్నమెంట్ హై స్కూల్ హెచ్ ఎం వీర రాఘవయ్యతెలిపారు ఈ సందర్బంగా హెచ్ ఎమ్ వీర రాగావయ్య క్రీడాకారులను అభినందిస్తూ ఆర్ ఆర్ అకాడమీ కోచ్ డి. పి.సుబ్బరాయుడు 3 సంవత్సరాల నుండి ఆర్ ఆర్ అకాడమీలో ఆళ్లగడ్డ లో ప్రతిభ ఉన్నటువంటి క్రీడాకారులను ఎంపిక చేసుకొని శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి,జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా కృషి చేస్తున్నారు అని వీరరాఘవయ్య గారు తెలిపారు. ఆర్ ఆర్ అకాడమీ కోచ్ సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్నటువంటి క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారికి తగిన విధంగా శిక్షణ మరియు ఆత్మస్థైర్యాన్ని, నమ్మకాన్ని, ప్రోత్సాహాన్ని తల్లిదండ్రులు,, ఉపాధ్యాయులు, శిక్షకులు క్రీడాకారుడికి కల్పించినప్పుడు తప్పకుండా ఆ క్రీడాకారుడు విజయాన్ని సాధిస్తారు అని కోచ్ సుబ్బారాయుడు తెలిపారు . ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయినిరాలు రాణెమ్మ గారు పాల్గొన్నారు.

# ముద్ద చర్మ వ్యాధిపై అప్రమత్తం...

### దేవనకొండలో పశువులకు ఉచిత టీకాలకార్యక్రమం:-పశువైద్యాధికారి డా.ఎన్.జి. వెంకటేష్






**దేవనకొండ, ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**పశువులను ప్రాణాంతక ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) నుంచి రక్షించేందుకు దేవనకొండ గ్రామంలో సోమవారం ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద్దులు, ఆవులు, ఆవు దూడలకు ఉచితంగా టీకాలు వేసి పశుసంవర్ధక శాఖ రైతులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ఎన్.జి. వెంకటేష్ మాట్లాడుతూ, ముద్ద చర్మ వ్యాధి పశువులకు సోకితే పాల ఉత్పత్తి తగ్గడం, శారీరక బలహీనత, ఆరోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు టీకానే అత్యంత ప్రభావవంతమైన మార్గమని పేర్కొంటూ, ఇంకా టీకాలు వేయించని రైతులు ఆలస్యం చేయకుండా తమ పశువులకు తప్పనిసరిగా ఉచిత టీకాలు వేయించుకోవాలని కోరారు. పశువుల్లో జ్వరం, చర్మంపై గడ్డలు, ఆహారం తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని సూచించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాల సదుపాయాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని తమ పశు సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పశుసంపద రక్షణతోనే రైతు కుటుంబాల ఆర్థిక భద్రత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఉచిత టీకాల కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా. ఎన్.జి. వెంకటేష్, ఏహెచ్‌ఏలు వీరకుమార్, అశోక్ పాల్గొని పశువులకు టీకాలు వేయడంతో పాటు రైతులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. రైతులు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన తెలిపి తమ పశు వులకు టీకాలు వేయించుకున్నారు. అధికారులు రానున్న రోజుల్లో కూడా టీకాల కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# దళిత మహిళ ఘటనలో నిందితుడికి మద్దతు ఇవ్వడం వైసీపీ రాక్షసత్వానికి పరాకాష్ట

### : ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు, ఆగస్టు 3, (ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**ఆలూరు నియోజకవర్గంలోని నెమకల్లు గ్రామానికి చెందిన దళిత మహిళపై జరిగినట్లు ఆరోపణలు ఉన్న ఘటనలో బాధితురాలికి అండగా నిలవాల్సింది పోయి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేకు మద్దతుగా వైఎస్సార్సీపీ నాయకులు ధర్నాలు నిర్వహించడం వారి రాజకీయ వైఖరికి నిదర్శనమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు.

దళిత మహిళ స్వయంగా ప్రజల ముందుకు వచ్చి తనకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతున్న నేపథ్యంలో, నిష్పాక్షిక విచారణ జరగాలని డిమాండ్ చేయాల్సిందిపోయి నిందితుడికి మద్దతుగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. దళితుల హక్కుల గురించి మాట్లాడే వైఎస్సార్సీపీ నాయకత్వం ఈ ఘటనలో తమ వైఖరిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో దళితులకు సంబంధించిన పలు కేసుల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రస్తావిస్తూ, నిందితులను కాపాడే రాజకీయ సంస్కృతి ఆ పార్టీలో నెలకొన్నదని ఆయన ఆరోపించారు. మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలు, గూండాయిజంతో ప్రజలు విసిగిపోయి వైఎస్సార్సీపీని తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. దళితులు, మహిళలపై జరిగే అన్యాయాల విషయంలో చట్టం తన పని తాను చేయాలని, బాధితులకు న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, అకృత్యాలకు పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నాలు చేసే వారికి ప్రజాకోర్టుతో పాటు చట్టపరంగానూ తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# కార్డియాలజీ యూనివర్సిటీ టాపర్‌కు డా. రామకృష్ణారెడ్డి స్మారక గోల్డ్ మెడల్

### కర్నూలు మెడికల్ కాలేజీలో అవార్డు ప్రదానోత్సవం డా. పర్వేజ్ నవాజ్‌కు పురస్కారం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 3)** కార్డియాలజీ విభాగంలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డా. పర్వేజ్ నవాజ్‌కు డా. రామకృష్ణారెడ్డి మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ సోమవారం ప్రదానం చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ కార్డియాలజీ సూపర్ స్పెషాలిటీ విభాగంలో నిర్వహించిన డా. రామకృష్ణారెడ్డి స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ, పూర్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, కార్డియాలజీ విభాగాధిపతి కీర్తిశేషులు డా. రామకృష్ణారెడ్డి వైద్య రంగానికి విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలోనే కార్డియాలజీ విభాగం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.



ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ ఫిజియోథెరపీ, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు.

డా. రామకృష్ణారెడ్డి కుమారుడు విజయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏడాది కర్నూలు మెడికల్ కాలేజీ కార్డియాలజీ సూపర్ స్పెషాలిటీలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి ఈ గోల్డ్ మెడల్‌ను అందజేస్తున్నామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ డీఎం విద్యార్థులే వరుసగా యూనివర్సిటీ టాపర్లుగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీఎస్సీ పారామెడికల్ విద్యార్థులు తమ సమస్యలపై వినతిపత్రాన్ని వైస్ ఛాన్సలర్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. కె. చిట్టి నరసమ్మ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు, కార్డియాలజీ విభాగాధిపతి డా. ఆదిలక్ష్మి, ఐఎంఏ సెక్రటరీ డా. రామేశ్వర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా. శ్రీరాములు, అధ్యాపకులు, వైద్యులు, పీజీ విద్యార్థులు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో రాయలసీమ...

## శ్రీశైలం ప్రాజెక్టు జల సంరక్షణపై తక్షణ చర్యలు చేపట్టాలి

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి జలవనరుల శాఖ కర్నూలు చీఫ్ ఇంజనీర్ ద్వారా రాయలసీమ సాగునీటి సాధన సమితి విజ్ఞప్తి**

**"శ్రీశైలం ప్రాజెక్టులో సంరక్షించే ప్రతి టీఎంసీ... రాయలసీమ తాగునీటి భద్రతకు, రైతాంగ మనుగడకు శ్రీరామరక్ష."**

**బొజ్జా దశరథ రామిరెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి.**

**నంద్యాల ఆగస్టు 3 (రిపబ్లిక్ న్యూస్) :** తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న రాయలసీమలో తాగునీరు, పశువుల తాగునీరు, ఆరుతడి పంటలకు కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించేందుకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణలో జల సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, కర్నూలు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసింది.

సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో ఈ మేరకు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రకటన విడుదల చేసారు.

ఈ సందర్బంగా బొజ్జా మాట్లాడుతూ.. కృష్ణా జలాల నిర్వహణలో శ్రీశైలం జలాశయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో జాతీయ జల విధానం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014, బచావత్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ నియమావళి ప్రకారం తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం, తదుపరి పశువుల తాగునీరు, అనంతరం ఆరుతడి పంటలకు కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.

గత వర్షాకాలంలో శ్రీశైలం జలాశయానికి 2,000 టీఎంసీలకు పైగా వరద జలాలు వచ్చినప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి పేరుతో పెద్దఎత్తున నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల జల సంరక్షణకు భంగం కలిగిందని, దాని ప్రభావమే ప్రస్తుతం రాయలసీమ ఎదుర్కొంటున్న తీవ్రమైన తాగునీటి, సాగునీటి సంక్షోభానికి ప్రధాన కారణమని అన్నారు.



**ప్రాధాన్యతగా చేపట్టాల్సిన కార్యాచరణ**

ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టాలని సమితి కోరింది.

మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు వెంటనే నీటిని పంపింగ్ చేయాలి.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్, తెలుగు గంగ, గాలేరునగరి ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రామీణ చెరువులకు తక్షణమే నీటిని విడుదల చేయాలి.

తాగునీరు, పశువుల తాగునీరు, ఆరుతడి పంటలకు అవసరమైన కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి.

**కృష్ణా డెల్టాకు ప్రత్యామ్నాయాలు... శ్రీశైలానికి జల సంరక్షణ**

కృష్ణా డెల్టా అవసరాల కోసం పట్టిసీమ, పులిచింతల వంటి ప్రత్యామ్నాయ నీటి వనరులను గరిష్ఠ స్థాయిలో వినియోగిస్తూ, శ్రీశైలం జలాశయం నుంచి అనవసర నీటి విడుదలను తగ్గించాలని సమితి సూచించింది. ప్రతి టీఎంసీ నీటిని భవిష్యత్ తాగునీటి అవసరాలు, కరువు పరిస్థితులు, రాయలసీమకు చట్టబద్ధంగా కేటాయించిన జలహక్కులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా నిర్వహించాలని కోరింది.

**ప్రాంతీయ న్యాయం కోసం జల సంరక్షణే మార్గం**

రాయలసీమ ప్రజల తాగునీటి భద్రత, పశుసంపద పరిరక్షణ, రైతుల జీవనోపాధి రక్షణ రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత బాధ్యత అని సమితి పేర్కొంది. అందువల్ల "శ్రీశైలం జల నిర్వహణలో జల సంరక్షణే ప్రధాన విధానం" అనే సూత్రాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బొజ్జా విజ్ఞప్తి చేసారు

"ఈరోజు శ్రీశైలంలో సంరక్షించే ప్రతి టీఎంసీ నీరు రేపటి రాయలసీమ తాగునీటి భద్రతకు, రైతాంగ మనుగడకు, పశు సంపద రక్షణకు, ప్రాంతీయ న్యాయానికి భరోసా అవుతుంది. అందువల్ల కృష్ణా డెల్టాకు ప్రత్యామ్నాయ నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ, శ్రీశైలం జలాశయంలో గరిష్ఠ స్థాయిలో జల సంరక్షణ చేపట్టే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి" అని బొజ్జా దశరథ రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు

# 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' ఇంటింటికీ ప్రచారంలో ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, ఆగస్టు 3 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఎమ్మెల్యే ఎంబీ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవ సోదర సోదరీమణులను కలిసి వారి క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్న ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాల



వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు.

ఈ సందర్భంగా వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణం, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే డా. బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, వార్డు కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# డీఎస్సీపై లోకేష్‌కు రాజీనామా సెగ

**డీఎస్సీ అక్రమాలపై రౌండ్ టేబుల్ సమావేశం**

**ఈనెల 6 నుంచి 9 వరకు రిలేదీక్షలు,10న ర్యాలీలు**

**టీచర్ పోస్టుల భర్తీపై సీబీఐ విచారణ చేయించాలి**

**వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత డిమాండ్**

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):** డీఎస్సీపై లోకేష్‌కు రాజీనామా సెగ రాజుకుంది. ఆంధ్రప్రదేశ్ లో నిర్వహించిన మెగా డీఎస్సీ2025 నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, కుల సంఘాల నాయకులు హాజరయ్యారు.

**జాబ్ క్యాలెండర్ ద్వారా 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంఓ తెలుగుదేశం, జనసేన, బీజేపీ లు జతకట్టి ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలను గుప్పించారని గుర్తు చేశారు. యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తూ



ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. లేనిపక్షంలో ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని గుర్తు చేశారు.

**తమకు కావాల్సి వారి కోసమే జీవోలను సృష్టి**

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సి పేరుతో పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడి అనర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని విమర్శించారు. తమకు కావాల్సి వారి కోసమే జీవోలను సృష్టించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. తక్షణం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేయని పక్షంలో మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి**

అంతేకాకుండా డీఎస్సి అవకతవకలపై సీబీఐ విచారణ




చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో యువతకు చెప్పిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు చేస్తున్న అన్యాయాలను ఖండిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 వ తేదీల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రిలే నిరాహారదీక్షలతో పాటు ఈ నెల 10వ తేదీన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు, నిరుద్యోగులకు మద్దతుగా వైయస్సార్ సీపీ చేపట్టబోతున్న రిలే నిరాహారదీక్షలు, నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులతో పాటు మేధావులు, విద్యావంతులతో పాటు పెద్ద ఎత్తున యువతీయువకులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# వేడి .. రా జుకున్న రాజ కీయం

**మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, -మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి అరెస్ట్**

**బీసీ రమేష్ గౌడ్ నూ అదుపులోకి తీసుకున్న పోలీసులు -పోలీసులు వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట**






**అనంతపురం/ఉరవకొండ, ఆగస్టు 03,( రిపబ్లిక్ క్రైమ్):** అనంతపురం జిల్లా ఉరవకొండలో రాజకీయం వేడి రాజుకుంది. సోమవారం వైఎస్సార్సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.

**శాంతియుత నిరసన .. అడ్డుకున్న పోలీసులు**

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉరవకొండలో శాంతియుత నిరసన నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సోమవారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతపురానికి తరలించినట్లు తెలిపారు. అనంతరం ఉరవకొండలోని వైఎస్సార్సీపీ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు మాజీ




ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. విశ్వేశ్వర్‌రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వైఎస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ప్రజాస్వామ్య హక్కులు అణచివేత : నాయకులు**

ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో పేదల భూములను ఆలయ భూములుగా పేర్కొంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులు కొనసాగుతున్నాయని విమర్శించారు. శాంతియుత నిరసన కార్యక్రమానికి అవకాశం ఇవ్వకుండా నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. ఉరవకొండలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వస్తేనమ్మా.. పోతినమ్మ తరహాలో అధికారుల తీరు!

**ఆరో వార్డులో స్విమ్మింగ్ పూల్ ను తలపిస్తున్న మురుగునీరు**

**సిమెంటు రోడ్డు నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యంగా ఇంజనీర్ల పనితీరు?**

**ఇష్టానుసారంగా సిమెంటు రోడ్డు నిర్మాణం**

**రోజుల తరబడి ఇళ్ల ముందే నిల్వ ఉంటున్న మురుగునీరు**

**ఎంతమందికి మొరపెట్టుకున్న పరిష్కారం కాని సమస్య**

**రోగాల బారిన బండి ఆత్మకూరు ఆరో వార్డు కాలనీవాసులు**

**బండి ఆత్మకూరు, ఆగస్టు 3 ,(రిపబ్లిక్ న్యూస్):-** మురుగు నీరు ఇంటి ముందు నిల్వ ఉండటంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇళ్లకు ఎదురుగా సిమెంట్ రోడ్డుపై మురుగు కుంటను తలపించేలా మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటే ఎలా భరించగలమని బండి ఆత్మకూరులోని ఆరవ వార్డు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇంట్లోకి వెళ్లాలన్నా అదే మురుగునీటిలో బురద తొక్కుకుంటూ ఇంట్లోకి వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం చిన్నపాటి వర్షం కురిసిన వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. ఈ విధంగా సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని కాలనీవాసులు వాపోయారు. సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించాల్సిన సంబంధిత



స్విమ్మింగ్ పూల్ తలపిస్తున్న మురుగునీరు

ఇంజనీర్లు పర్యవేక్షణ లోపం కారణం తమకు శాపంగా మారిందని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం రోజుల తరబడి ఎంతోమంది మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కరించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే పంచాయతీరాజ్ అధికారులు మురుగునీటిని పరిశీలించి తొలగిస్తాం చేయిస్తాం అని చెప్పి పోవడమే తప్ప ఇంతవరకు కనీసం తాత్కాలిక చర్యలు కూడా చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల తీరు మాత్రం కేవలం ఒస్తినమ్మ.. పోతినమ్మ తరహాలో మాత్రమే ఉందన్నారు. కనీసం పబ్లిక్ కుళాయి నీటిని కూడా ఈ మురుగునీటిలోనే పట్టుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ అధికారులు తమ సమస్యకు పరిష్కారం చూపడం లేదని కాలనీవాసులు దుయ్యబట్టారు. మురుగునీరు రోజుల తరబడి అక్కడి నుంచి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసనతో వస్తున్నది. దుర్గంధం వెదజల్లుతూ దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ఆ ఇంట్లో ఉండేవారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. ఇళ్ళ ముందు కొలతల ప్రకారం సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ వేసి ఉంటే ఇంటి ముందు మురుగు నీరు ఆగేది కాదని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇంటి ముందు మురుగు నీరు నిల్చుని ఉంటుందని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లే విధంగా సొంత డబ్బులతో జేసీబీ సాయంతో క్లీనింగ్ చేస్తున్నారు. అయినా కొన్ని రోజులకే మురుగు నీరు మరలా చేరుతుంది. అధికారులు ఇప్పటికైనా డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా నివారించాలని ఆరవ వార్డు కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

# డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**-మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన పట్టణ సీఐ కంబగిరి రాముడు**



**ఎమ్మిగనూరు, ఆగస్టు 3 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ 16వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 28, 29, 30 తేదీల్లో నెల్లూరులో జరగనున్న నేపథ్యంలో మహాసభల ప్రచార కరపత్రాలను ఎమ్మిగనూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ ఎమ్మిగనూరు కన్వీనర్ విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, డివైఎఫ్ఐ నాయకులు అజిత్ మాట్లాడుతూ, దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వ శాఖల్లో ఉన్న లక్షలాది ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ విధానాల కారణంగా శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతుండగా, చదువుకున్న యువత ఉపాధి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. గత ఏడాది కాలంగా ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అమలు, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ నియామకాల కోసం డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు, వినతిపత్రాల సమర్పణ, నిరసన కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. అలాగే డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు, రక్తదాన శిబిరాలు, మొక్కల నాటడం, శ్రమదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతను చైతన్యవంతం చేస్తోందన్నారు. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సామాజిక న్యాయం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం డివైఎఫ్ఐ నిరంతరం పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. నెల్లూరులో జరగనున్న 16వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రజలు, యువత తమ వంతు నైతిక, ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాకేష్, సురేష్, అభిషేక్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి వివాదం నేపథ్యంలో దారుణం

**కొడుకును గొడ్డలితో నరికి చంపిన తండ్రి**

**బనగానపల్లె ఆగస్ట్ 03 రిపబ్లిక్ న్యూస్** బనగానపల్లె మండలం యనకన్ల గ్రామంలో సోమవారం తెల్లవారుజామున దారుణ ఘటన చోటుచేసుకుంది గత కొంతకాలంగా ఆస్తి వివాదం విషయంలో తండ్రి, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి కొడుకు మధు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తండ్రి మదిలెట్టి గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం అనంతరం ఈ విషయాన్ని అడ్డుకునేందుకు వచ్చిన భార్యపై కూడా దాడికి యత్నించగా ఆమె కారం పొడి చల్లి అక్కడి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు హత్య చేసిన మదిలెట్టి పరారీలో ఉండడంతో ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు



మృతి చెందిన వ్యక్తి (మధు 30)

# డీఈఓగాడాక్టర్ అయ్యూబ్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ



**అనంతపురం ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ)గా డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాలకు కొత్తగా డీఈఓలను నియమిస్తూ ఆమె ఉత్తర్వులు విడుదల చేశారు. అందులో భాగంగా అనంతపురం డీఈఓగా అయ్యూబ్ హుస్సేన్ ను నియమించారు. కర్నూలు జిల్లా బి. తాండ్రపాడులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్న హుస్సేన్ ను పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ డీఈఓగా నియమించారు.

**బాధ్యతలు స్వీకరించిన డీఈఓ కు పలువురు శుభాకాంక్షలు**

ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఆయన సోమవారం అనంతపురం చేరుకున్నారు. కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఏడీ-1, 2 కడప మునీర్ ఖాన్, శ్రీనివాసులు, నోడల్ ఆఫీసర్ రాంప్రసాద్, ఏపీఓ మంజునాథ్, ఏఎస్ఓ బోయ శ్రీనివాసులు, ఎయిడెడ్ సెక్షన్ అధికారి జగదీశ్, ఐటీ విభాగం చంద్రశేఖరరెడ్డి, గుత్తి డిప్యూటీ డీఈఓ లక్ష్మన్న, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల అసోసియేషన్ ప్రతినిధులు కూడా కొత్త డీఈఓను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

# అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తాం

**కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు**



**అనంతపురం /గుంతకల్లు, ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):** అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంతకల్లు పట్టణంలో సోమవారం నిర్వహించిన “డోర్ టు డోర్“ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు పాల్గొన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్లు మండల టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో 15వ వార్డు పరిధిలోని 80వ బూత్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన నాయకులు కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ గుడ్ ఫిట్టింగ్ ఆంజనేయులు, 15వ వార్డు అధ్యక్షుడు దబ్బర నారాయణ, 84వ బూత్ కో-కన్వీనర్ నవీన్, వాల్మీకి కదిరప్ప, గోవిందరాజులు, టీడీపీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# స్వాతంత్ర వేడుకలు.. పండుగ వాతావరణంలో నిర్వహించాలి

**ఆకట్టుకునే అభివృద్ధి శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలి**

**కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్**

**శ్రీ సత్య సాయి/కలెక్టరేట్, ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):** ఈ నెల 15న నిర్వహించనున్న 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పరేడ్ మైదానంలో చేపట్టాల్సిన సన్నాహకాలపై సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

**సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రగతిని ప్రతిబింబించేలా**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ, వేదిక ఏర్పాట్లు, అలంకరణ పనులను సుందరంగా చేపట్టాలని సూచించారు. పరేడ్ మైదానంలో బారికేడింగ్, వైట్‌వాష్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్ & బి అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రత్యేక అతిథులను గౌరవప్రదంగా ఆహ్వానించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పుట్టపర్తి




మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఆర్ఓ కు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు**

దేశభక్తిని చాటే విధంగా ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు సమర్పించాలని తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల మార్చ్‌ఫాస్ట్‌లో ఎన్సీసీ కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ..జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పోలీస్ శాఖ తరపున చేపట్టాల్సిన అన్ని భద్రతా, పరేడ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఎఎస్పి అంకిత సురన, జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, ఆర్డీవో సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భూపతిపూర్ లో ఏలేటి సత్య,శంకర్ ల విద్యుత్ ప్రమాదం వల్ల ఇల్లు దగ్ధం

### పరిశీలించిన మాజీ మంత్రి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి




**రాయికల్ మండలం ఆగష్టు,03( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామం లో ఏలేటి సత్య o/శీ శంకర్ ఇంట్లో ప్రమాదవాశత్తు విద్యుత్ ప్రమాదం ఏర్పడి ఇల్లు కలిపోవడంతో కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఈ విషయమై ఫోన్ లో విద్యుత్ శాఖ అధికారులతో, ఎమ్మార్వో తో మాట్లాడుతూవిద్యుత్ ప్రమాదంతో కాలిపోయిన ఏలేటి సత్య గారి ఇంటికి ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం అందించాలని సూచించారుఈ కార్యక్రమంలో యువజన నాయకుడు తాటిపర్తి సీకె రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరావు, తీగల తిరుపతి, హరీష్, జక్కుల సాగర్, బందెల తిరుపతి, మహేందర్,లక్ష్మణ్ మరియు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు

# రాయికల్ మున్సిపల్ 7, వార్డ్ లో విద్యుత్ లేక రాత్రిపూట పాముల భయముతో బిక్కు బిక్కువుంటున్న ప్రజలు!!

**రాయికల్ మండలం ఆగస్టు 03( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ 7వర్డ్ కౌన్సిల్లో విద్యుత్ లేక 7వార్డ్ ప్రజలు చీకట్లో కదుపుతున్నారు ఈ విషయమై స్థానిక లైన్మెన్ ను అడిగిన కారణాలు చెప్పుడే కానీ విద్యుత్ మత్ర శీరావడం లేదు రాత్రిపూట విషపూరితమైన పాములు తేళ్లు సంచరిస్తుంటాయని బత్తిని బాబు గౌడ్ ఆరోపించాడు రాయికల్ కు సంబంధించిన అతి పెద్ద మురికి కాలువ ఇక్కడి నుండి వెళ్తుంటుంది కాబట్టి పాములు తేళ్లు రాత్రిపూట విద్యుత్తు లేక పొరపాటున బయటకి వెళ్తే పాములు కాటేస్తే ప్రాణాపాయం ఉంటుందని ఉన్నత అధికారులు దీనిపై శ్రద్ధ తీసుకొని వెంటనే విద్యుత్ మరమ్మత్తులు చేయాలని శ్రీ గద్దె సుమన్, బాబు గౌడ్, శేఖర్, వినయ్, కోరరు



# కొత్తపేటలో అనారోగ్యం తో ఉండగా పలువురిని పరమర్శించినా మాజీ మంత్రి జీవన్ రెడ్డి




**రాయికల్ మండలంఆగష్టు,03( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో మధు మరియు వడ్డెర కాలనీలో నర్సయ్య అనారోగ్యంతో ఉండగా వారి నివాసంలో పరామర్శించారు. మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి వారి వెంట. యువజన నాయకుడు తాటిపర్తి సికె రెడ్డి చింతలపల్లి గంగారెడ్డి, బోధసు రాజిరెడ్డి,రాజాం,నరేందర్,గంగారెడ్డి,గంగరాజం, మల్లేశం,నడిపిరాజం తదితరులు పాల్గొన్నారు

### నాగర్ కర్నూల్ బార్ నెంబర్ న్యాయవాది మల్లయ్య అత్యను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా న్యాయవాదుల బృందం హత్యకు పాల్పడ్డ వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమం తెలిపారు






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ బార్ నెంబర్ అయినా బి మల్లయ్య అనే న్యాయవాది ని హత్య చేయడాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని న్యాయవాదులపై ఈ మధ్య జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు హత్యకు పాల్పడ్డ నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ బి సంజీవరెడ్డి ప్రధాన కార్యదర్శి దరిపల్లి అశోక్ విపి మంజుల రెడ్డి సభ్యులు ప్రభాకర్ శ్రీ విట్టల్ రెడ్డి ప్రదీప్ నందు పటేల్ శ్రీనివాస్ గౌడ్ పద్మజ నర్సింలు మెంబర్స్ సతీష్ ఆర్ శ్రీనివాస్ జి వెంకట్ రాములు, విష్ణువర్ధన్ రెడ్డి మరియు సభ్యులు పాల్గొన్నారు

# బీఎస్పీ నాయకుడి కూతురుని పరామర్శించిన చీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం

**వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బహుజన్ సమాజ్ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ సైదాపూర్ మండలానికి చెందిన కొయ్యేడ మధు యొక్క కూతురు అక్షర (8సంవత్సరాలు) అదే రోడ్ ప్రమాదంలో గాయపడి కుడి చేయి కుడి కాలు విరిగి వరంగల్ లో ఎంజిఎం ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న పాప ను బీఎస్పీ చీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం గారు ఈ రోజు హుస్నాబాద్ అసెంబ్లీ నాయకులతో కలసి పరామర్శించారు. ఎంజిఎం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఒక శస్త్ర చికిత్స ఆపరేషన్ పూర్తయింది. ఇంకో ఆపరేషన్ ఉన్నందున ఎవరైన రక్షిత రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ దొడ్డే సమ్మయ్య, అసెంబ్లీ అధ్యక్షులు వేల్పుల రాజు, అసెంబ్లీ నాయకులు జేరిపోతుల రాజు తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల నియోజకవర్గం జనసేన పార్టీ కార్యవర్గ సమావేశం

### ఆగష్టు,04 న జగిత్యాల్ శివాసాయి రెసిడెన్షియల్ హాల్లో

**రాయికల్ మండలం ఆగష్టు,03 ( రిపబ్లిక్ న్యూస్)**
జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తెలంగాణా రాష్ట్ర లో జనసేన పార్టీ బలోపేతం లో భాగంగా జడ్పీటీసీ ఎంపీటీసీ కార్పొరేషన్ స్థానిక ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలనే ఉద్దేశం తో తెలంగాణా రాష్టంలో సశీస్తాగత బలోపేతం పార్టీ విస్తరణ స్థానిక సమస్య ల సమీక్ష తదితర అంశాలమీద నిజామాబాద్ లో పార్లమెంట్ లో జరిగే మొట్ట మొదటి కార్యకర్తల సమావేశశీ నిర్వహణ లో తెలంగాణా రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాస్ సారద్యంలో నిజామాబాద్ పార్లమెంట్ కార్యకర్తల సమ్మేళనశీ ఆగస్టు 8 తేదీన జరుగుతుంది సభ విజయవంతం అయ్యేలా జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జి కోర్ కమిటీ ఏర్పాటు చేసారు జగిత్యాల టౌన్ శివ సాయి రెసిడెన్సియల్ హాల్లో ఆగస్టు 4,న సమావేశం నిర్వహించనున్నారు



కావున జగిత్యాల నియోజకవర్గం లోని జనసేన సేన పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కమిటీ సభ్యులు జగిత్యాల జగిత్యాల టౌన్ కమిటీ నాయకులు జనసైనికులు నియోజకవర్గంలో నీ 4మండలాల కమిటీ అధ్యక్షులు సభ్యులు నాయకులు జన సైనికులు జగిత్యాల టౌన్ వీరవిభాగం కమిటీ వీర మహిళలు అలాగే జగిత్యాల టౌన్ లో కౌన్సిలర్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున పోటీ చేసిన అభ్యర్థులు మరియు రాయికల్ మండలంలో కౌన్సిలర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు జగిత్యాల పట్టణలోని నాయకులు జనసేన పార్టీ కార్యకర్తలు



అందరు హాజరు కాగలరు వేదిక తహసీల్ చౌరస్తా గాయత్రీ బ్యాంకు ఎదురుగా శివసాయి హోటల్ కన్వెన్షన్ హాల్లో ఆగష్టు,04 న సమయం మధ్యాహ్నం12:00కు సమావేశం ఉంటుందని జగిత్యాల్ నియోజకవర్గం ఇన్చార్జి బెక్కం జనార్దన్ తెలిపారు

# రోదించిన పసిగుండె,,,
# కంటతడి పెట్టించిన ఘటన

### కియా పోలీస్‌స్టేషన్ వెనుక నవజాత శిశువు లభ్యం
### వైద్య చికిత్స అనంతరం శిశుగృహానికి తరలింపు

**శ్రీ సత్య సాయి /పెనుకొండ, ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):**
అమ్మా ..ఏతప్పు చేశాను నేను..ఈ జన్మకు "మాతృమూర్తి" నా కెవరు .. ఇష్టంగా చూసి..ప్రాణంగా పెంచి. ఇలా నడిరోడ్డున..వదిలేస్తావనుకోలేదు. ఏమి ఆపదవచ్చింది అమ్మా .. పసిబిడ్డ రోదన .. అందరికీ కంటతడి తెప్పించింది

**అప్పుడే జన్మించిన ఓ మగ శిశువు అనాథ**
శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం కియా పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలోని మునిమడుగు పంచాయతీ పరిధి నరసింహస్వామి ఆలయం సమీపంలో సోమవారం ఉదయం అప్పుడే జన్మించిన ఓ మగ శిశువు అనాథగా కనిపించడం స్థానికులను కలచివేసింది.

**అప్పుడే జన్మించిన పసిబిడ్డను ఇలా వదిలివెళ్లడం బాధాకరం**
ఉదయం శిశువు ఏడుపు వినిపించడంతో సమీపంలో ఉన్న వారు అక్కడికి వెళ్లి చూడగా, ఇంకా రక్తపు తడి ఆరని నవజాత శిశువు కనిపించాడు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అప్పుడే జన్మించిన పసిబిడ్డను ఇలా వదిలివెళ్లడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమాచారం అందుకున్న అధికారులు శిశువును స్వాధీనం చేసుకుని వైద్య పరీక్షల కోసం అనంతపురంలోని నవజాత శిశు కేంద్రానికి తరలించారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి



అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ శిశువుకు పూర్తి వైద్య చికిత్స అందించిన అనంతరం శిశుగృహానికి తరలించి సంరక్షణ కల్పిస్తామని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### కలెక్టరేట్ ప్రజావాణిలో 48 వినతులు స్వీకరణ.... జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట



రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేటి ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, ఈఈ (పంచాయతీరాజ్), పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి , కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవలతో భక్తుల మన్ననలు పొందాలి

### - అందరి సహకారంతో ఆలయాభివృద్ధికి పాటు పడాలి
### - మహానంది ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి





**మహానంది, ఆగస్టు 3, (రిపబ్లిక్ న్యూస్)**
శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలని, దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ భక్తుల మన్ననలు పొందాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కోరారు. మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ వాస్తవంగా గత ఏడాది క్రితమే ధర్మకర్తల మండలి ఏర్పాటు కావాల్సి ఉందని, అనివార్య కారణాలవల్ల ఆలస్యం అయిందన్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ధర్మకర్తల మండలి చైర్మన్ సభ్యులు దేవస్థానం అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. శ్రీ మహానందీశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఇక్కడే మూడు నవ నందుల ఆలయాలు ఉండటం, ఏడాది



పొడవునా ఏ మాత్రం తగ్గని అద్భుత జల సంపద కలిగిన కోనేరులు ఎంతో మహిమాన్వితం అన్నారు. ఇంతటి ప్రసిద్ధ, ప్రముఖ క్షేత్రంలో ధర్మకర్తలుగా పని చేసే అవకాశం రావడం శివానుగ్రహం అన్నారు. అందరూ అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు జరిగేందుకు దాతల సహకారం తీసుకోవాలన్నారు. మీ వంతుగా తగిన పాత్ర వహిస్తూ అందరి సహాయ సహకారాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు.

**ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా మౌళీశ్వర రెడ్డి**
మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా మసీదుపురం గ్రామానికి చెందిన నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి చైర్మన్, సభ్యులు, ఎక్స్



అఫీషియో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస రెడ్డి, బీజేపీ నాయకురాలు షబానా, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, మహానంది వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సారూ... మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయరూ..

**ఏర్పాటు చేయడంలో డి ఎం హెచ్ ఓ నిర్లక్ష్యం**

**కలెక్టర్ కార్యాలయంలో లో అర్జీదారుల అవస్థలు**

**పిజిఆర్ఎస్ లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు కు జిల్లా కలెక్టర్ ఆదేశించేనా**




**శ్రీ సత్య సాయి కలెక్టరేట్, ఆగస్టు 03,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మెడికల్ కం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారిని మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్చదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**నీరసించి పోతున్న అర్జీదారులకు వైద్యం కరువు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమాల్లో భాగంగా, కలెక్టరేట్లు, పోలీస్ కార్యాలయాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. ఈ శిబిరాల్లో ప్రజలకు ఉచిత పరీక్షలు, అవగాహన తో పాటు మందుల పంపిణీ చేయాలి. అయితే పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయకుండా డీఎంహెచ్వో అధికారిని ఫిరోజ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వందల సంఖ్యలో ప్రజలు తమ







అర్జీలను పరిష్కరించేందుకు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో అర్జీదారులు కలెక్టర్ కార్యాలయంలో వేచి ఉన్నప్పుడు నీరసించి పోయే ప్రమాదం ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వ్యయ ప్రయాసలకోర్చి వస్తుంటారు ఆతరణంలో ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. పిజిఆర్ఎస్ లో నిరసించి పోతున్న అర్జీదారులకు వైద్యం కరువయ్యింది.ప్రమాదం తెలిసి డిఎంహెచ్వో నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసం. ప్రజల ప్రాణాలు పోతే నే అధికారులు పట్టించుకుంటారా... మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాల్సి ఉన్న కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని నిర్లక్ష్యం వీడడం లేదు.

**అర్జీదారుల అర్జీలు ఆన్లైన్ కంప్యూటర్ లో జాప్యం**

అంటే బాధ్యతాయుతంగా విధిలు నిర్వర్తించాల్సి ఉన్నా ఆ ఉన్నత అధికారిని... ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధాకరం.

వీటి పైన జిల్లా కలెక్టర్ డి ఎం హెచ్ ఓపై శాఖ పరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా పి జి ఆర్ ఎస్ లో అర్జిదారులు ఆన్లైన్ చేసే క్రమంలో ఆన్లైన్ కంప్యూటర్ లో జాప్యం జరుగుతోంది. వందల సంఖ్యలో ప్రజలు పిజిఆర్ఎస్కు రావడంతో పదుల సంఖ్యలో పనిచేయాల్సిన ఆన్లైన్ కంప్యూటర్లు కేవలం ఐదు కంప్యూటర్లు ఉండడంతో పిజిఆర్ఎస్ ను సరిపెట్టుకొని పోతున్నారు.

### సమ్మర్ లో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తాం: డి ఎం హెచ్ ఓ

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోమెడికల్ క్యాంప్ లేకపోవడంతో "ప్రజా రిపబ్లిక్"ప్రతినిధిసంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఫిరోజ్ ను అడిగగా.. ఆమె సమ్మర్ లో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతోంది. ప్రజల ప్రాణాలు అంటే డిఎంహెచ్ఓ గారికి అంత చులకన ఎందుకో .. మరి. మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి పరిరక్షించాల్సిన ఉన్నత అధికారి నిర్లక్ష్యంగా మాట్లాడడం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో చోటుచేసుకుంది.

**అర్జీలు తొందరగా ఆన్లైన్ నమోదు అయ్యే అవకాశం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్జీదారులు వేల సంఖ్యలో ప్రతి సోమవారం జిల్లా నలమూలల నుంచి అర్జీదారులు వస్తుంటారు వెళుతుంటారు. ఈ క్రమంలో పిజిఆర్ఎస్ అర్జీలను కొంతమంది అధికారులు వ్రాస్తూ కాలయాపన చేస్తున్నారు. దీంతో పి జి ఆర్ ఎస్ సమయం వృధా అవుతుందని చెప్పవచ్చు. అర్జీలు రాసే కొంతమంది అధికారులను సైతం ఆన్లైన్ కంప్యూటర్ ఆపరేటర్లుగా ఉపయోగించుకుంటే... పిజిఆర్ఎస్ అర్జీలు తొందరగా ఆన్లైన్ నమోదు అయ్యే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు పీజిఆర్ఎస్ లో కంప్యూటర్లు తక్కువ ఉన్నాయి కాబట్టి వాటిపైన దృష్టి పెట్టి మిగతా కొన్ని కంప్యూటర్లను పిజిఆర్ఎస్ కు ఉపయోగిస్తే అర్జీల సమస్య తగ్గే అవకాశం ఉందని చెప్పవచ్చు. జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు వీటిపై ని దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రభుత్వ ఉద్యోగులు ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజ్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఫ్లెక్సీ డిపాజిట్ ద్వారా జీతంలో పొదుపుకు మెరుగైన అవకాశం -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 03 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో అధిక శాతం మంది తమ జీతభత్యాల ఖాతాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో నిర్వహిస్తున్నందున, బ్యాంకు అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజ్ ( ఎస్ జి ఎస్ పి) ద్వారా లభించే ప్రత్యేక సౌకర్యాలు, బీమా రక్షణ, రుణ రాయితీలు, పొదుపు అవకాశాలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ అందిస్తున్న ప్రత్యేక సేవలు, శాలరీ ప్యాకేజ్, ఆరోగ్య బీమా, ఫ్లెక్సీ డిపాజిట్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో డి. రాము నాయక్, నూనెపల్లె ఎస్‌బీఐ శాఖ మేనేజర్ రవితేజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు తమ జీత ఖాతాలను సాధారణ సేవింగ్స్ ఖాతాలుగానే కొనసాగించడం వల్ల బ్యాంకు అందిస్తున్న పలు ప్రత్యేక ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. అందువల్ల ప్రతి ఉద్యోగి తమ ఖాతాను స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజ్ ( ఎస్ జి ఎస్ పి) కింద నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగుల నెలసరి నికర వేతనం ఆధారంగా సిల్వర్, గోల్డ్, డైమండ్, ప్లాటినం, రోడియం కేటగిరీలుగా శాలరీ ప్యాకేజ్ ఖాతాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నికర జీతం పొందేవారికి



సిల్వర్, రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు గోల్డ్, రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు డైమండ్, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ప్లాటినం, రూ.2 లక్షలకు పైబడిన వారికి రోడియం కేటగిరీ వర్తిస్తుందని వివరించారు. ఈ శాలరీ ప్యాకేజ్ ద్వారా కనీస సగటు నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) నిర్వహించాల్సిన అవసరం ఉండదని, అపరిమిత ఉచిత ఏటీఎం లావాదేవీలు, ఆన్‌లైన్ ఎన్ ఈ ఎఫ్ టి, ఆర్టిజిఎస్ సేవలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపారు. అదనంగా, ఎస్‌బీఐ డెబిట్ కార్డు వినియోగదారులకు వ్యక్తిగత ప్రమాద బీమా, విమాన ప్రమాద బీమా కలిపి రూ.1.60 కోట్ల వరకు ఆర్థిక రక్షణ లభిస్తుందని తెలిపారు. శాలరీ ప్యాకేజ్‌లో చేరదలచిన ఉద్యోగులు తమ పే స్లిప్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఉద్యోగి గుర్తింపు కార్డుతో సమీప ఎస్‌బీఐ శాఖను సంప్రదించి ఖాతాను అప్‌గ్రేడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో




ఉంచుకుని ఎస్‌బీఐ అత్యల్ప ప్రీమియంతో సూపర్ హెల్త్ టాప్-అప్ బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శాలరీ ప్యాకేజ్ ఖాతాదారులు కుటుంబ సభ్యులతో కలిసి తక్కువ ప్రీమియంతో అధిక ఆరోగ్య బీమా రక్షణ పొందే అవకాశం ఉందన్నారు. సఫైర్ హెల్త్ పాలసీతో పాటు టాప్-అప్ సదుపాయాన్ని వినియోగించుకోవడం ద్వారా సుమారు రూ.20 లక్షల వరకు ఆరోగ్య బీమా రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగులు తమ జీతంలో కొంత మొత్తాన్ని క్రమబద్ధంగా పొదుపు చేసుకునేందుకు ఫ్లెక్సీ డిపాజిట్ సౌకర్యం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ తెలిపారు. సాధారణ సేవింగ్స్ ఖాతాలో లభించే వడ్డీతో పోలిస్తే ఫ్లెక్సీ డిపాజిట్ ద్వారా సుమారు 6.5 శాతం వరకు వడ్డీ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఖాతాలో నిర్ణీత పరిమితికి మించిన మొత్తం ఆటోమేటిక్‌గా ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మారి, అవసరమైన సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తిరిగి వినియోగించుకునే వీలుంటుందని తెలిపారు. ఈ విధానం ఉద్యోగుల్లో పొదుపు అలవాటును పెంపొందించడంలో సమర్థవంతంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసుల ప్రత్యేక దృష్టి

**పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో 149 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**



**నంద్యాల క్రైం, ఆగస్టు 3, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి పోలీసు సేవలను మరింతగా ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్)" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 149 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరిధిలో న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ఫిర్యాదుల పరిష్కారాన్ని పూర్తి చేయడంతో పాటు, ఒకసారి పరిష్కరించిన సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి సకాలంలో పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోండి

**రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి -పీజీఆర్ఎస్‌లో 405 ప్రజా వినతులు స్వీకరణ -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 03 (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో, నాణ్యతతో పరిష్కరించి ప్రజా సంతృప్తి పెంపొందించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ డి. రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు మొత్తం



5,397 దరఖాస్తులు రీఓపెన్ కాగా, వాటిలో 5,376 పరిష్కరించబడినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 21 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, ఆలస్యం కారణాలను సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అటవీ శాఖకు సంబంధించిన ఒక దరఖాస్తు నిర్దేశిత సేవా గడువు (ఎస్ఎల్ఏ) దాటిన అంశంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అలాగే అధికారుల లాగిన్‌లో ఇంకా పరిశీలించని 348 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కార




ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా అందుతున్న వినతులపైనా ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కు సంబంధించిన వివరాలను వెంటనే నవీకరించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 211 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం




దోహదపడుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 211 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, స్వర్ణ గ్రామ/వార్డులకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 30, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 26, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 39, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 55, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 53, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 5 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన వినతులు**

-గడివేముల మండలం, బిలకలగూడూరు గ్రామానికి చెందిన శ్రీమతి పి. ప్రమీలమ్మ వేల్పనూరు గ్రామ పరిధిలోని సర్వే నెం.315/ఎ2లో తనకు ఉన్న 3.50 సెంట్ల భూమిలో, పట్టాదారు పాస్‌పుస్తకంలో 3.32 సెంట్లు మాత్రమే నమోదయ్యాయని, మిగిలిన విస్తీర్ణాన్ని కూడా నమోదు చేయాలని కోరుతూ వినతి సమర్పించారు.

-జూపాడుబంగ్లా మండలం, బన్నూరు గ్రామానికి చెందిన ఎ. సద్గుణం చిన్ననాగన్న తన సర్వే నెం.90/3లోని 1.20 సెంట్ల భూమి చుక్కల భూమిగా నమోదై నిషేధిత జాబితాలో ఉండడంతో, ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

-మహానంది మండలం, గాజులపల్లె గ్రామానికి చెందిన కె. సాయి కృష్ణ మహాదేవపురం గ్రామ పొలిమేరలోని సర్వే నెం.510/1ఎల్, ఎల్‌పీఎం నెం.612 పరిధిలో 2.71 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా నమోదైందని, దానిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి సమర్పించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com

# బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 03 రిపబ్లిక్ న్యూస్**

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'తల్లిపాల వారోత్సవాలు' చౌడేపల్లి, పుదిపట్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సులోచన, రాధమ్మలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన అరగంట లోపు తల్లీబిడ్డలకు స్పర్శను కల్పిస్తూ తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువు పాలిట అమృతంతో సమానమని, అవి బిడ్డకు తొలి టీకాగా పనిచేసి జీవితాంతం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని వివరించారు. పుట్టినప్పటి నుంచి కనీసం ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అప్పుడే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని స్పష్టం చేశారు. బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు తల్లిపాలలోనే పుష్కలంగా ఉంటాయి. బయటి పాలు, డబ్బా పాలు వాడటం వల్ల పిల్లలు తరచూ అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లులు కూడా బ్రెస్ట్ క్యాన్సర్, ఒబేసిటీ లాంటి సమస్యల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు. ముర్రుపాలు పారబోయకూడదని, అపోహలు విడనాడి ప్రతి తల్లీ తప్పనిసరిగా బిడ్డకు పాలివ్వడాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన నవసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూపర్‌వైజర్లు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ఆడికృత్తికకు మాజీ మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం

**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్**



ఈనెల 6,7 తేదీలలో స్థానిక షణ్ముఖ సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరగనున్న ఆడి కృత్రిక మహోత్సవానికి మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించారు సోమవారం చౌడేపల్లి కి చెందిన బెల్లాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బెల్లాల సుబ్రహ్మణ్యం బెల్లాల మోహన తదితరులు తిరుపతిలోని ఆయన నివాసంలో కలసి పండుగకు ఆహ్వానం పలికారు

# తిరోగమనములో దళిత గ్రామాలు గుర్తించి పరిష్కరించండి సారు!

## ప్రజా సంఘాల ధర్నా.





**రైల్వే కోడూరు ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్.**

చిట్వేల్ మండలంలో సుమారు 43 దళిత గ్రామాలు సామాజికం, ఆర్థికంగానే కాకుండా మౌలిక సదుపాయాలు లేక తిరోగమనములో కొట్టుమిట్టాడుతున్నాయని, అధికారులు గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం చిట్వేలి తాసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించాయి, ప్రజా సంఘాల సామాజిక సర్వేలో భాగంగా, వచ్చిన సమస్యలు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల మండల పరిధిలోని దళిత గ్రామాలలో అనేక సమస్యలు గుర్తించడం జరిగినది. సోమవారం గ్రీవెన్స్ సమావేశంలో,స్మశానాలకు దారులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, వీధిలైట్లు, పెన్షన్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరడం జరిగినది. చిట్వేల్ మండల పరిధిలో దాదాపు 43 దళిత గ్రామాలు ఉన్నాయి ఆ గ్రామాలలో సామాజిక సమస్యలపై జిల్లా కమిటీలు సామాజిక సర్వే చేయడం జరిగింది. ఆ దళిత గ్రామాలలో ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు ఈ సమస్యలపై దళిత గ్రామాలను సందర్శించి దళిత సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అందులో ప్రధానంగా, మిట్టపల్లి దళితవాడలో, దళితులు ఓటు హక్కు వినియోగించుకోకుండా అగ్రవర్ణాల అడ్డుకుంటున్నారని, అందుకు ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో స్పందించి, పోలింగ్ బూత్ ఏర్పాటు చేసే దానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్మశానానికి, సర్వే చేయమని ఆదేశించారు. వీధిలైట్లు వేయాలని ఎండిఓ గారిని ఆదేశించారు. త్వరలో మీ సమక్షంలో గ్రామసభ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా తిమ్మయ్య గారి పల్లెలో స్మశానానికి దారికి ఇద్దరు అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. వికలాంగుల కు గట్టుమీద పల్లెలో ఇచ్చిన ఇండ్ల స్థలాలు చూపించాలని కోరారు. ఆ సమస్య సర్వే చేసి వారి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మల్లీమడుగు ప్రాంతంలో 1970 సర్వే నెంబర్లు, 150 ఎకరాలు అగ్రవర్ణాలు భూకబ్జాలో పాల్పడుతున్నారని, తక్షణం దళితులకు ఆ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యులు, పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా నాయకులు, ఓబిలి పెంచలయ్య, రైతు సంఘ నాయకులు, శంకరయ్య, భాష, హైమావతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లి దళితవాడకు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి ,దళిత వాడలలో స్మశానాలు ఏర్పాటు చేయాలి స్మశానాలకు బోర్లు వేసి ప్రహరీ గోడ నిర్మించాలి వీధి రోడ్లు వీధిలైట్లు ఏర్పాటు చేయాలి ఇండ్లు ఇండ్లు స్థలాలు పెన్షన్లు మంజూరు చేయాలి గతంలో వికలాంగులకు గట్టుమీదపల్లెలో కేటాయించిన స్థలాలను చూపించాలని కోరారు. దళితవాడలలో మంచినీటి వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేయాలి మండల పరిధిలో ఉన్న అంగనవాడి కేంద్రాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి , ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. తిమ్మయ్యగారి పల్లి దళితులకు, స్మశానానికి దారికి ఆటంకం కలిగిస్తున్న ఇద్దరిపై చర్య తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్వో నరసింహారావు గారికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు సానుకూలంగా స్పందించిన తాసిల్దార్ అనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# మానవత్వం చాటుకున్న భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధా రావణ్

**జహీరాబాద్ ఆగస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



జహీరాబాద్ కష్టాల్లో ఉన్నవారిని చూసి కరిగిపోయే మనసే నిజమైన సమాజ సేవకు నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్ధా రావణ్ మరోసారి నిరూపించారు. జహీరాబాద్ జాతీయ రహదారిపై నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఒక అనాథ యువకుడికి తక్షణ సహాయం అందించి తన ఉదారతను, మానవత్వాన్ని చాటుకున్నారు. జహీరాబాద్ జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తున్న సమయంలో, రోడ్డు పక్కన ఆకలితో, చిరిగిన దుస్తులతో అత్యంత దీనస్థితిలో ఉన్న ఒక యువకుడు సిద్ధా రావణ్ కంటపడ్డాడు. ఆ దృశ్యాన్ని చూసి తీవ్రంగా చలించిపోయిన వారు వెంటనే తన వాహనాన్ని ఆపి, ఆ యువకుడి వద్దకు వెళ్లారు. అతడి పరిస్థితిని అడిగి తెలుసుకొని, స్వయంగా తన చేతులతోనే ఆకలి తీర్చారు. సదరు యువకుడికి కడుపునిండా అన్నం తినిపించి, తాగునీరు అందించారు. వణుకుతున్న ఆ యువకుడికి తక్షణమే నూతన వస్త్రాలు కొనుగోలు చేసి అందజేశారు. అతనికి అవసరమైన ప్రాథమిక సహాయం అందించి, సురక్షిత ప్రాంతానికి చేర్చే ఏర్పాట్లు చేశారు. మార్గమధ్యలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, స్థానిక ప్రజలు సిద్ధా రావణ్ చేసిన ఈ సేవను దగ్గరుండి చూసి అభినందనల వర్షం కురిపించారు. పదవుల కంటే తోటి మనుషులకు సహాయం చేయడమే గొప్ప గుణమని ఆయనను కొనియాడారు.

"సమాజంలో ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు చేయూతనివ్వడమే నిజమైన మానవత్వం. ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో బాధితులకు సహాయం చేయడానికి ముందుకు రావాలి. అని సిద్ధా రావణ్, తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ & శాంతి ఫౌండేషన్ చైర్మన్ పిలుపునిచ్చారు

# ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

**-ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న అదనపు ఎస్పీ.**

**-ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు - అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.**

**సంగారెడ్డి గస్టు 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**




జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అదనపు ఎస్పీ తెలియజేశారు.

# మండల అభివృద్ధికి కృషి చేద్దాం : మాదిరాజు





**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్ :** మండల సర్వతో ముఖాభివృద్ధికి అందరం కృషి చేద్దామని పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదిరాజు లక్ష్మణ రాజు( పతి రాజు) కోరారు సోమవారం ఈమెకు మండల కేంద్రమైన చౌడేపల్లిలోని పరిపాలన భవనంలో అధికారులతో ఆయన సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత దాహార్తిని తీర్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు కార్యాలయాలకు సమస్యలు పరిష్కరించాలని వచ్చే ప్రజలకు స్నేహభావంతో మెలగి వారి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు ముఖ్యంగా రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు అదేవిధంగా సమస్యలపై చర్చించారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పగడాల హరి రాయల్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల రామచంద్రయ్య ,డాక్టర్ మహేష్,వేలూరు సుబ్రహ్మణ్యం, కృష్ణారెడ్డి, కార్తీక్, వెంకటరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎండిసి పబ్లిక్ స్కూల్లో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వండి

**-కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.**

**రైల్వే కోడూరు ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్.**



రైల్వేకోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లె మండలం మంగంపేట గ్రామానికి చెందిన నిరాశ్రిత కుటుంబాల పిల్లల విద్యాహక్కు ప్రశ్నార్థకంగా మారింది. వారికి దక్కాల్సిన ప్రాధాన్యత లేదని ఇల్లు భూములు సర్వస్వం కోల్పోయిన స్థానిక గ్రామీణ బాధితుల సంక్షేమం కోసం 2018లో ఏపీఎండీసీ సౌజన్యంతో, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద నిర్మించిన పాఠశాలలో నేడు స్థానికులకే ప్రాధాన్యం కరువైందని, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన అన్నారుమంగంపేట, కాంపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడ, అగ్రహారం, కొత్త మంగంపేట గ్రామాలలో ఇళ్లు, భూములు కోల్పోయి అభాగ్యులుగా మారిన నిరుపేద కుటుంబాల పిల్లలకు ఇన్నాళ్లూ ఈ విద్యాసంస్థలో ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. ఎల్కేజీ ప్రవేశాల కోసం పేద కుటుంబాలకు చెందిన పిల్లల తల్లిదండ్రుల నుంచి రూ. 300 వసూలు చేసినప్పటికీ, కనీసం ప్రవేశాలు కల్పించకపోగా, వారి నుండి స్పష్టమైన సమాధానం కూడా లభించకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ప్రాథమిక విద్యనభ్యసించి తమ భవిష్యత్తును దిద్దుకుందామనుకున్న చిన్నారుల ఆశలపై ఈ వైఖరి నీళ్లు చల్లుతోందనీ ఆరోపించారు. ఈ విద్యాసంస్థ ప్రాంగణంలో స్థానికులకు దక్కాల్సిన ప్రవేశాలను నిరాకరిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మరియు అధ్య వెంకటేష్ ఏపీఎండిసి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ. స్థానిక నిరాశ్రయులకు జరుగుతున్న అన్యాయాన్ని, విద్యాసంస్థ యాజమాన్య తీరును జిల్లా పాలనాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధిత కుటుంబాల పిల్లలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారమే పరమావధిగా వినతిపత్రాలు స్వీకరిస్తున్న తాసిల్దార్ సిద్దేశ్వరరావు.



**రైల్వే కోడూరు ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా వినతిపత్రాలను తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వరరావు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల భూ సమస్యలు, ఇంటి పట్టాలకు సంబంధించిన సమస్యలు, విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు తదితర అంశాలపై వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని స్వయంగా తెలుసుకుని, సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, వీఆర్వోలు, వివిధ గ్రామాల ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోలా శంకర్ సేవా సమితి ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ.

**రైల్వే కోడూరు ఆగస్టు 3 రిపబ్లిక్ న్యూస్:**






మండల కేంద్రం రైల్వే కోడూరు కి చెందిన తోట సుస్మిత వర్ధంతి సందర్భంగా సోమవారం ఆమె భర్త తోట సుదీర్ నిరుపేదలైన నాలుగు కుటుంబాలకు నిత్యవసర సరుకులు బియ్యము పంపిణీ చేస్తూ తన మానవత్వాన్ని చాటుకున్న ఆ వ్యక్తికి బోలా శంకర్ సేవా సంస్థ ద్వారా ధన్యవాదాలు అలాగే ఈ నిరుపేదలకు రంగనాయకులపేట కు చెందిన బి ఎల్లమ్మ ఉంగరాల నగర్ కు చెందిన సుబ్బమ్మ గాంధీ నగర్ కు చెందిన గంగమ్మ బలిజ వీధికి చెందిన నిర్మలమ్మ నిరుపేదలైన ఈ నలుగురికి బోలా శంకర్ సేవా సమితి ద్వారా నిత్యవసర వస్తువులు బియ్యము ఉప్పు పప్పు మిరపకాయలు తదితర నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ బోలాశంకర్ సమితి మానవత్వాన్ని సాటుకుంటూ ఎక్కడ ఏ నిరుపేదకు సహాయం కావాలన్నా బోల శంకర్ సమితి అధ్యక్షులు మందల నాగేంద్ర ద్వారా సమితి సభ్యుల ద్వారా తెలియపరిస్తే వారికి సకాలంలో స్పందించి మా వంతు సహాయ సహకారాలు చేయుటకు సభ్యులు ముందుచూపుతో వ్యవహరిస్తారు అలాగే ఎవరైనా దాతలు సహాయం చేయదలచిన వారు అధ్యక్షులకు కమిటీ సభ్యులకు తెలియజేస్తే మీ సహాయసహాకారాలతో పేదలకు అందిస్తాం బోలా శంకర్ సేవా సమితి అధ్యక్షులు మందల నాగేంద్ర చెన్నం శెట్టి రమేష్ పన్నీర్ ఆంజనేయులు యనమల రత్తయ్య సుగవాసి మల్లికార్జున పి రాజేశ్వరమ్మ పెనుగొండ సుబ్బారాయుడు కొర్లకుంట శంకరయ్య బొంపల్లి నాగరాజు మహంకాళి సుబ్రహ్మణ్యం పాండు సోడిశెట్టి లత నార్జాల నిర్మలమ్మ నార్జాల ప్రభావతి లక్ష్మీదేవి డబ్బ్యా విజయమ్మ నార్జాల యతిన్ నార్జాల కౌశిక్ మందల పవన్ సాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.